


# విజయభాను




విశాఖపట్నం, శనివారం 11-05-2019 VIJAYABHANU DAILY VISAKHAPATNAM EDITION సంపుటి : 42 సంచిక : 209 పేజీలు : 8 వెల : 1 రూపాయి

## రామలింగేశ్వరుడి సన్నిధిలో కేసీఆర్ కుటుంబం

### అబ్దుల్ కలాం సమాధి వద్ద అంజలి



రామేశ్వరం: తమిళనాడు పర్యటనలో ఉన్న తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ రామేశ్వరంలోని ప్రసిద్ధ రామలింగేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఇందుకోసం గురువారమే రామేశ్వరం చేరుకున్న కేసీఆర్ అక్కడ మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం సమాధి వద్ద అంజలి ఘటించారు. తర్వాత అక్కడే బస చేసిన సీఎం ఈ ఉదయం కుటుంబ సభ్యులతో కలిసి రామలింగేశ్వరస్వామి ఆలయానికి వెళ్లారు. ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికిన వేద పండితులు స్వామివారి దర్శనం చేయించారు. ఈ సందర్భంగా కేసీఆర్ కుటుంబ సభ్యులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ధనుష్ కోటి, రామసేతు, పంచముఖ హనుమాన్‌లను కూడా దర్శించుకున్నారు. కేసీఆర్‌తో పాటు తరువాయి 2లో..



### కాంగ్రెస్ కాలంలో

# కుటుంబ పాలనకే ప్రాధాన్యత

- నాడు జరిగిందేదో జరిగిపోయిందంటే ఎలా?
- సిక్కుల ఊచకోత వ్యవహారంపై ధ్వజం
- కాంగ్రెస్ నేతలది అహంకారపూరిత వైఖరి
- ఎన్నికల ప్రచారంలో ధ్వజమెత్తిన మోదీ



రోహ్‌తక్: 1984 నాటి సిక్కుల ఊచకోతపై కాంగ్రెస్ నేత శ్యాంపిట్రోడా చేసిన వ్యాఖ్యలపై ప్రధాని నరేంద్ర మోదీ హస్తం పార్టీపై తన విమర్శలకు మరింత పదును పెట్టారు. సిక్కుల ఊచకోత ఘటనను ఉద్దేశించి జరిగిందేదో జరిగిపోయిందంటూ పిట్రోడా చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్ నేతల అహంకారపూరిత వైఖరికి నిదర్శనమన్నారు. హరియాణాలోని రోహ్‌తక్‌లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ప్రధాని నరేంద్ర మోదీ.. 1984 నాటి ఘటనను గుర్తుచేస్తూ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. దేశాన్ని ఎక్కువ కాలం పాలించిన కాంగ్రెస్ పార్టీ ప్రజలను పట్టించుకోకుండా ఒక కుటుంబం అభివృద్ధికే ప్రాధాన్యం ఇచ్చిందని ఆరోపించారు. దేశంలో పేదలు మరింత పేదలుగా మారిపోతున్నారని, అవినీతి నిరంతరం పెరుగుతూనే ఉందని, నల్లధనం ఆర్థిక వ్యవస్థలో ముఖ్యమైన అంశంగా మారిపోయిందంటూ వ్యాఖ్యానించారు. దేశంలో మధ్య తరగతి తరువాయి 2లో..



## ఆర్టీఐ యాక్టు ప్రకారమే నియమించాలి

### సీఎస్‌కు విజయసాయి రెడ్డి లేఖ

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో ఆర్టీఐ కమిషనర్ల నియామకంపై వైఎస్సార్ కాంగ్రెస్ కాంగ్రెస్ పార్టీ అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ మేరకు పార్టీ ఎంపీ విజయసాయి రెడ్డి శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎల్వీ సుబ్రమణ్యంకు లేఖ రాశారు. లేఖలో సారాంశం... 'విజయవాడకు చెందిన హోటల్ యజమాని ఐలాపురం రాజాను ఇన్ఫర్మేషన్ కమిషనర్‌గా నియమించటంపై వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తీవ్ర అభ్యంతరం తెలియజేస్తోంది. రాష్ట్ర విద్యాశాఖ మంత్రికి ప్రైవేటు సెక్రటరీగా ఉన్న ఇ.శ్రీరాంమూర్తి, ఐలాపురం రాజాలు టీడీపీ పార్టీ యాక్టివిస్టులు. ఇలాంటి వారిని ఆర్టీఐ కమిషనర్లుగా ఎలా నియమిస్తారు?. ఆర్టీఐ యాక్ట్ 2005, సెక్షన్ 15 ప్రకారం నియామకాలు చేపట్టాలి. ఆర్టీఐ యాక్ట్ 2005 సబ్ సెక్షన్ 5 ప్రకారం స్టేట్ చీఫ్ ఇన్ఫర్మేషన్ కమిషనర్, స్టేట్ ఇన్ఫర్మేషన్ కమిషనర్లుగా బాధ్యతలు చేపట్టేవారికి తగిన అర్హతలు ఉండాలని తెలియజేస్తోంది. ఆర్టీఐ యాక్ట్ ప్రకారం తరువాయి 2లో..

## ముగిసిన ఆరో దశ ఎన్నికల ప్రచారం

న్యూఢిల్లీ: ఆరోదశ లోక్‌సభ ఎన్నికల ప్రచారం ముగిసింది. మొత్తం ఏడు రాష్ట్రాల్లోని 59 స్థానాలకు గానూ మే 12న ఆరో దశలో ఎన్నికలు జరుగుతాయి. ఈ దశలో బిహార్‌లోని 8, దిల్లీలోని 7, హరియాణాలోని 10, ఝార్ఖండ్‌లోని 4, మధ్య ప్రదేశ్‌లోని 8, ఉత్తర్‌ప్రదేశ్‌లోని 14, పశ్చిమ బెంగాల్ లోని 8 స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. చివరి దశ ఎన్నికలు మే 19న జరుగుతాయి. 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఇప్పటివరకు మొత్తం 424 నియోజకవర్గాలకు ఎన్నికలు ముగిశాయి. మిగతా 118 స్థానాలకు గానూ ఆరు, ఏడు దశల్లో పోలింగ్ జరగనుంది. లోక్‌సభ ఎన్నికల ఫలితాలు మే 23న వెల్లడవుతాయి.

ఏడు రాష్ట్రాల్లోని 59 స్థానాల రాజకీయ నేతల భవిష్యత్తును నిర్ణయించడానికి ఓటర్లు సిద్ధమయ్యారు. ఆరో దశ ఎన్నికలు జరుగుతున్న అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద అధికారులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు తరువాయి 2లో..




### ఓట్ల లెక్కింపు భాద్యత

# రిటర్నింగ్ అధికారులదే

- ఇ.సి.ఐ. నిబంధనలపై అవగాహన పెంచుకోవాలి
- తూ.చా. తప్పక అమలు పర్చాలి
- ఇ.వి.ఎం.లను తీసుకువచ్చే, తీసుకువెళ్లే మార్గాలు వేరుగా ఉండాలి
- అల్పాహారం, భోజన ఏర్పాట్లు ఆర్.ఓ.లే చూసుకోవాలి
- ల్యాండ్ ఫోన్, ఫ్యాక్సు, ఇంటర్నెట్ లతో పాటు నిర్ణీత ప్రొఫార్మాలను సిద్ధం చేసుకోవాలి
- కౌంటింగ్ అధికారులకు, సిబ్బందికి రెండు విడతల్లో శిక్షణా కార్యక్రమాలు
- నియోజకవర్గాలపై సమావేశాలు నిర్వహించి ఏజంట్ల వివరాలు సేకరించాలి
- అరుకు ఫెసిలిటేషన్ కేంద్రంలో పడ్డ పోస్టల్ బ్యాలెట్ల వివరాలు అందకపోవడంపై ఆగ్రహం
- కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి కె.భాస్కర్



విశాఖపట్నం: ఈ నెల 23 న జరగనున్న ఓట్ల లెక్కింపు భాద్యతను సంబందిత రిటర్నింగ్ అధికారులే వహించాల్సి ఉంటుందని కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి కె.భాస్కర్ స్పష్టంచేశారు. ఓట్ల లెక్కింపు విషయంలో భారత ఎన్నికల సంఘం నిర్ణయించిన విధి, విధానాలపై రిటర్నింగ్ అధికారులు సమగ్ర అవగాహన పెంచుకొని తూ.చ. తప్పక వాటిని అమలు పర్చాలని సూచించారు. ఓట్ల లెక్కింపు విషయంలో ఏమాత్రం తేడా వచ్చినా ఉపేక్షించేది లేదని రిటర్నింగ్ అధికారులను ఆయన హెచ్చించారు. శుక్రవారం తన చాంబరులో అన్ని నియోజక వర్గాల రిటర్నింగ్ అధికారులతో సమావేశమై ఓట్ల లెక్కింపుకు చేస్తున్న ఏర్పాట్లను సమీక్షించారు. స్ట్రాంగ్ రూమ్స్ నుండి ఇ.వి.ఎం.లను తీసుకువచ్చే మరియు తీసుకువెళ్లే మార్గాలు వేరు వేరుగా ఉండాలని, ఆయా మార్గాలను బారి కేడింగ్ వేరు వేరుగా నిర్మించాలని సూచించారు. ఓట్ల లెక్కింపు కేంద్రాల్లోకి సెల్ ఫోన్లను అనుమతించడం జరుగదని, ల్యాండ్ ఫోన్, ఫ్యాక్సు, ఇంటర్నెట్లతో పాటు నిర్ణీత ప్రొఫార్మాలను సిద్ధం చేసుకోవాలన్నారు. ప్రతి శాసన సభా తరువాయి 2లో..

## విచారణకు హాజరైన టీవీ9 మూర్తి




హైదరాబాద్: టీవీ9 యాజమాన్యంలో తలెత్తిన వివాదాలపై పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది. అలంద మీడియా డైరెక్టర్ కౌశిక్‌రావు ఫిర్యాదు మేరకు టీవీ9 సీఈవో రవిప్రకాశ్, ఫైనాన్స్ డైరెక్టర్ మూర్తి, సినీనటుడు శివాజీపై సైబరాబాద్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేశారు. రవిప్రకాశ్, శివాజీ, మూర్తి ఇళ్లతో పాటు టీవీ9 కార్యాలయంలో సోదాలు నిర్వహించిన పోలీసులు... వారిని విచారణ నిమిత్తం కోర్టుకు హాజరు కావాల్సిందిగా నోటీసులు జారీ చేశారు. పోలీసుల ఆదేశాలతో టీవీ9 ఫైనాన్స్ డైరెక్టర్ మూర్తి శుక్రవారం మధ్యాహ్నం సైబర్ క్రైం పోలీసుల ఎదుట విచారణకు హాజరయ్యారు. రవిప్రకాశ్, సినీనటుడు శివాజీ ఇప్పటి వరకూ విచారణకు హాజరుకాలేదు. వీరిద్దరూ విచారణకు హాజరుకాకపోతే మరోసారి నోటీసులు జారీ చేయాలని సీసీఎస్ పోలీసులు భావిస్తున్నట్టు సమాచారం.

సొంత లబ్ధి కోసం ఛానల్‌కు సంబంధించి నకిలీపత్రాలు సృష్టించారని, ఫోర్జరీ చేశారని గత నెల 24న కౌశిక్ ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఆయన ఫిర్యాదు ఆధారంగా సైబర్ క్రైం పోలీసులు మోసంతో పాటు ఐటీ చట్టం కింద తరువాయి 2లో..

## రాష్ట్రానికి న్యాయం కోసమే టీడీపీ ధర్మపోరాటం

- ఓటమి భయంతోనే మోదీ చౌకబారు వ్యాఖ్యలు
- భాజపాకు ప్రత్యామ్నాయం కూడగట్టాం
- ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు



అమరావతి: ప్రతి కార్యకర్త రాజకీయాలను అధ్యయనం చేసే స్థాయికి చేరాలని శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గ సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆకాంక్షించారు. 37 ఏళ్లుగా రాజకీయాలు చేస్తున్న వారంతా మరింతగా రాణించాలని పిలుపునిచ్చారు. మంగళగిరిలోని హ్యాపి రిసార్ట్స్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రానికి న్యాయం కోసమే తెలుగుదేశం పార్టీ ధర్మపోరాటం చేసిందని తెలిపారు. దేశవ్యాప్తంగా తరువాయి 2లో..



# కెఆర్ఎస్ ఫార్మా ప్రమాదంపై సమగ్ర విచారణ జరపాలి

## సిపిఎం డిమాండ్

విశాఖపట్నం : పరవాడ ఫార్మాసిటీలో గల కెఆర్ఎస్ ఫార్మాసిటికల్స్ కంపెనీలో శుక్రవారం మధ్యాహ్నం జరిగిన ప్రమాదంపై సమగ్ర విచారణ జరపాలని సిపిఎం విశాఖ జిల్లా కమిటీ డిమాండ్ చేస్తున్నది. ఈ ప్రమాదాన్ని బయటకు పొక్కకుండా యాజమాన్యం అనేక ప్రయత్నాలు చేసింది. దీనిబట్టి చూస్తే ఈ ప్రమాదంపై పలు అనుమానాలకు తావిస్తున్నది. పొగలు, పెద్ద శబ్ధం రావటంతో కార్మికులు, ఉద్యోగులు పరుగులు తీసారు. ఈ ప్రమాద సంఘటన స్థలం వద్దకు మీడియాను కూడా అనుమతించకపోవడం దారుణం. యాజమాన్యం కంపెనీలో భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం వల్లే ఈ ప్రమాదం జరిగింది. తరుచూ ఫార్మా కంపెనీల్లో ప్రమాదాలు జరుగుతున్నా, భద్రతా ప్రమాణాలు, ప్రమాదాలు నివారణా చర్యలు చేపట్టవల్సిన ప్రభుత్వ యంత్రాంగం యాజమాన్యాలతో కుమ్మక్కై నిమ్మకు నీరెత్తున్నట్లు వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వాలు ప్రైవేట్ కంపెనీలకు ఇబ్బడి ముబ్బడిగా రాయితీలు ఇచ్చి యాజమాన్యాలను ప్రోత్సహిస్తున్నాయి తప్పా, అందులో పనిచేస్తున్న కార్మికులు భద్రతా విషయాలు పట్టింకోకపోవడం దుర్మార్గం. హెట్రో, దివీస్, ఆక్టాస్, గ్లోకమ్, దక్కన్ కెమికల్స్ వంటి ఫార్మా కంపెనీల్లో ప్రమాదాలు జరినప్పుడు మంత్రులు హడావడి తప్పా శాశ్వత నివారణా చర్యలు చేపట్టడంలో పూర్తిగా విఫలమయ్యారు. ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్‌ను, కాలుష్య నియంత్రణ మండలిని, లేబర్ డిపార్టుమెంట్‌ను పూర్తిగా నిర్వీర్యమైంది. భద్రతా ప్రమాణాలపై మోనటరింగ్‌లేదు. కార్మిక చట్టాలు కూడా అమలు చేయకుండా కంపెనీ యజమానులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొమ్ముకాస్తుంది. పర్యవసానంగా ఘోరమైన విస్పోటనాలకు దారితీసి కార్మికులను బలిగొంటున్నాయి.యాజమాన్యాలు లాభాలపై చూపిన దృష్టి కార్మికుల భద్రతపై చూపడంలేదు. జిల్లా కలెక్టర్ మరియు ప్రభుత్వం వెంటనే ఈ ప్రమాదంపై స్పందించి సమగ్రమైన విచారణ జరిపి కంపెనీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని సిపియం డిమాండ్ చేస్తోంది.

# 17 లక్షల పశుపక్ష్యాదుల మృతి



గోపాలపూర్ : 'ఫాని' తుపానుకు 17 లక్షల (అధికారికంగా) పశుపక్ష్యాదులు మృత్యు వాత పడ్డాయి. పూరీ-కోణార్క్ బలుఖాండో (మెరైన్ డ్రైవ్) అభయారణ్యం మూగ ప్రాణులకు ఆలవాలం. 87 వేల ఎకరాల విస్తీర్ణమున్న ఈ ప్రాంతంలో లక్షలాది చెట్లు పెనుగాలుల ధాటికి నేల కొరిగాయి. అధికారిక లెక్కల ప్రకారం.. ఈ అటవీ ప్రాంతంలో 4 వేల లేళ్లు, జింకలు, నక్కలు, తోడేళ్లు, కుందేళ్లు పుష్కలంగా ఉన్నాయి. కాగా తుపాను తర్వాత వాటి సంచారం కనిపించడం లేదు. దుర్వాసన వ్యాపించి ఉండగా, పెద్దసంఖ్యలో మూగప్రాణులు మృతిచెంది ఉంటాయని పూరీ అటవీ శాఖాధికారి(డీఎఫ్ఓ) నారాయణ సామల్ గురువారం విలేకరులకు చెప్పారు. బలుఖాండో అభయారణ్యం విరిగిన చెట్లతో దుర్గంధం వెదజల్లుతోందని తెలిపారు.

**కోళ్ల ఫారాల ఆనవాళ్లు లేవు :** తుపాను పూరీ, ఖుర్ధా, కేంద్రపడ, జగత్సింగ్‌పూర్, కటక్ తదితర జిల్లాలను ప్రభావితం చేసిన సంగతి విధితమే. కాగా పశువులు, పక్షులు లక్షల్లో మృతిచెందాయి. కళేబరాలు ఇంకా కనిపిస్తున్నాయి. కాకపోతే కోళ్లఫారాలకు తీవ్ర నష్టాలు వాటిల్లాయి. పూరీ, ఖుర్ధా జిల్లాల్లో వాటి ఆనవాళ్లు మిగల్లేదు. బ్యాంకు రుణాలు తెచ్చి ఫారాలు ఏర్పాటు చేసిన వారి ఆవేదన అంతా ఇంతా కాదు. రిలీఫ్ కోడ్ ప్రకారం పశుపక్ష్యాదుల మ ృతికి పరిహారం చెల్లిస్తామని రిలీఫ్ కమిషనర్ బిష్ణుపదసెఠి చెప్పారు.

కాగా ఇంతవరకు అధ్యయనం జరగలేదు. ఏమేరకు నష్టాలు జరిగాయన్నది స్పష్టం కాలేదు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూస్తున్న వారంతా రుణాలు మాఫీ చేయాలంటున్నారు. మళ్లీ నిలదొక్కుకునేలా సత్వర చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

32 వేల ఎకరాలలో
# కాఫీ సాగుకు చర్యలు




కొరాపుట్ : జిల్లా వాతావరణం, ప్రక ృతి సంపద, కాఫీ సాగుకు అనువైనదిగా ఉండడంతో జిల్లాలో 32 వేల ఎకరాలలో కాఫీ సాగుకు జిల్లా యంత్రాంగం రంగం సిద్ధం చేస్తోంది. తొలి విడతగా వెయ్యి ఎకరాలలో సాగు చేసేందుకు స్థలం గుర్తింపు లబ్ధిదారుల జాబితా తయారైంది. కొరాపుట్, నందపూర్, పాడువా, దశమంత్ పూర్, పొట్టంగి సమితులలో కాఫీ సాగ్కుఉ అన్నిరకాల ప్రాంతాలు నిపుణులు గుర్తించడంతో, జిల్లా యంత్రాంగం, కాఫీ బోర్డు ఆధ్వర్యంలో కాఫీ సాగు నిర్వహించనున్నారు. ఈ ప్రక్రియలో భాగంగా కలెక్టర్ సుదర్శన చక్రవర్తి గురువారం కాఫీబోర్డు ప్రాంగణంలో కాఫీ సాగును పరిశీలించారు.

# జూన్‌లోగా పనులు పూర్తి చేయాల్సిందే



రాయచూరు : హై-క ప్రదేశ్ అభివృద్ధి మండలి 2013-14 నుంచి 2017-18 వరకు అనుమతి ఇచ్చిన అన్ని పనులను ఈ ఏడాది జూన్ నెలాఖరుకు పూర్తి చేయాలని మండలి కార్యదర్శి సుబోద్ యాదవ్ ఆదేశించారు. కలబురగి ప్రాదేశిక కమిషనర్ సభాంగణంలో హై-క భాగంలోని కలబురగి, బీదర్, యాదగిరి, రాయచూరు, బళ్లారి, కొప్పళ జిల్లాలకు సంబంధించి పనుల అమలు ఏజెన్సీ అధికారుల సమావేశం జరిగింది. దీనికి అధ్యక్షత వహించిన సుబోద్ మాట్లాడుతూ పనులు మందగతిన జరిగితే సహించేదిలేదని స్పష్టం చేశారు 2018-19 ఏడాదికి సంబంధించి ప్రగతిలో ఉన్న పనులను జూన్ నెలాఖరుకు ఎట్టిపరిస్థితుల్లో ముగించాలని స్పష్టం చేశారు. మండలి ప్రతిపనికి ప్రత్యేకంగా నిధులను ఆయా ఏజెన్సీలకు విడుదల చేసింది. కొన్ని ఏజెన్సీలు ఒక పనికి కేటాయించిన నిధులను ఇంకొక దానికి ఖర్చు చేస్తున్నట్లు తెలిసిందని, ఇలా చేయడం సరికాదన్నారు. ఎందుకు ఇలా చేశారో సరైన కారణాన్ని తెలియజేస్తూ పనుల పురోగతి నివేదికను ఈ నెల 13లోపు పంపాలని సూచించారు. ఏ పనికి మంజూరు చేసిన నిధులను దానికే ఖర్చు చేయాలని, లేకుంటే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# నష్టాల్లో పొద్దుతిరుగుడు రైతు



సిమిలిగుడ : ఓవైపు వేసవి తీవ్రత.. మరోవైపు నీటి వనరుల కొరత పొద్దుతిరుగుడు రైతును నష్టాల ఊబిలోకి నెడుతోంది. కొరాపుట్ జిల్లాలో పరిస్థితే ఇందుకు నిదర్శనం. కొరాపుట్ జిల్లాలో దశమంత్‌పూర్, పొట్టంగి సమితిల్లో పొద్దు తిరుగుడు పంటకు ఎంతో అనుకూలం. ఆయా ప్రాంతాల్లో రైతులు అదనపు పంటగా పొద్దు తిరుగుడును పండిస్తున్నారు. అయితే నీటి వనరులు కొరత కారణంగా పంట శాతం తగ్గుతూ వస్తోంది. అసలే మండే ఎండల్లో నీటి వనరులు ఎండిపోవడంతో రైతులు పంటకు నీటిని అందించలేక ఆందోళన చెందుతున్నారు. దశమంత్‌పూర్ సమితి కె.జానిగూడ, పొట్టంగి సమితి మాలిపుట్‌ల్లో పొద్దుతిరుగుడు పంటను పండిస్తూ వస్తున్నారు. కూరగాయలతో పాటు ఈ పంటపైన రైతులకు ఆసక్తిపెరిగింది. కానీ పొద్దుతిరుగుడుకు నీటి వనరులు అవసర ముండగా, పంటకు రైతులు నీటిని అందించలేని దుస్థితి నెలకొంది. ఎండల తీవ్రత రెండేళ్ల గా పెరుగుతున్న కారణంగా నదులు, గెడ్డలు, వాగులు ఎండిపోయాయి. దీంతో రైతులు పంటకు అందించలేకున్నామని ఆందో ళన చెంద ఎతున్నారు. పంటకు ఇదే సమయంలో నీటిని అందిస్తే పంట అనుకూలంగా చేతికి అందుతుందని, ఈ ఏడాది నీటి కొరత కారణంగా పంట దిగుబడి తగ్గేపోయే అవ కాశాలు ఉన్నట్లు రైతులు వాపోతున్నారు. ఇటు వంటి దీన పరిస్థితి ఎన్నడూ రాలేదని, అందుకే చింగిడిమాలి, మాలిపుట్‌ల్లో చెక్ డ్యామ్‌ను నిర్మిస్తే తమకు అనుకూలంగా ఉండి, పంట బాగా చేతికి అందుతుందని గణేష్ అనే రైతు అభిప్రాయాన్ని వ్యక్తంచేశారు. రెండు ప్రాంతాల్లో 10 ఎకరాల్లో పంట పండిస్తుండగా, నీటిని అందించడంలో రైతులు అయో మయంలో పడ్డారు. ప్రభుత్వమే తమను ఆదు కోవాలని రైతులు కోరుతున్నారు.



# ముంబై పోలీసులకు 'ఇషా' యోగా శిక్షణ

కోయంబత్తూరు : ముంబై పోలీసులు కోవైలోని ఇషా యోగా కేంద్రం ఆధ్వర్యంలో శిక్షణ తీసుకున్నారు. ముంబై పోలీసు కమిషనర్ సుబోధ్ కుమార్ జైస్వాల్ యోగా శిక్షణలో పాల్గొనే సిబ్బందికి సెలవు మంజూరు చేశారు. ఈ ఏడాది ఫిబ్రవరి నెలలో ప్రారంభమైన బ్యాచ్‌కు 150, మార్చిలో జరిగిన బ్యాచ్‌కు 100 మంది పాల్గొన్నారు. దాదర్‌లోని నైగాన్ పోలీసు ట్రైనింగ్ సెంటర్‌లో బుధవారంతో రెండో శిబిరం ముగిసిందని నిర్వాహకులు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు.

# అవాంతరాల నడుమ ఆంగ్ల మాధ్యమం అమలు

## 13లోగా పాఠశాలల జాబితా ప్రకటన



బెంగళూరు : ప్రతి తాలూకాకు రెండు చొప్పున రాష్ట్ర వ్యాప్తంగా 1000 ఆంగ్ల మాధ్యమ పాఠశాలలు స్థాపించాలనేది సర్కారు లక్ష్యం. గత బడ్జెట్‌లో ముఖ్యమంత్రి కుమారస్వామి చేసిన ఈ ప్రకటనను మిత్రపక్షమే వ్యతిరేకించింది. మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, కన్నడ సాహితీవేత్తలంతా ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం మాతృభాషపై దాడి అంటూ విమర్శలు గుప్పించడం ఇక్కడ ప్రస్తావనార్హం. ముఖ్యమంత్రి మాత్రం తీసుకున్న నిర్ణయంపై వెనక్కు తగ్గలేదు. సరికదా ఈ పాఠశాలల నిర్వహణకు సంబంధించిన అన్ని చర్యలు దాదాపుగా పూర్తి చేశారు. కన్నడంతో పాటు ఆంగ్లాన్ని బోధించే ప్రాథమిక స్థాయి ఆంగ్ల మాధ్యమ పాఠశాలలు ఎక్కడెక్కడ ఏర్పాటు చేస్తారో ఈనెల 13లోగా ఓ ప్రకటన వెలువడనుంది. ఈ మేరకు రాష్ట్ర మాధ్యమిక విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి ఉమాశంకర్ తాజాగా విధివిధాన ప్రకటన చేశారు. ప్రతి పాఠశాలలో 30 మంది విద్యార్థులకు ఆంగ్లాన్ని బోధిస్తారు. ఈ పాఠశాలు బోధించే ఉపాధ్యాయులకు ఇప్పటికే ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. తల్లిదండ్రులు సైతం ఆంగ్ల భాష అవసరంపై ఎటువంటి వ్యతిరేకతను వ్యక్తం చేయలేదు. పోటీ ప్రపంచంలో విలువ ఆధారిత చదువుల కోసం ఆంగ్ల మాధ్యమ పాఠశాలలు తప్పవన్న అభిప్రాయం మేరకే ఈ నిర్ణయాన్ని తీసుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ పాఠశాలల ఏర్పాటు చేసినంత మాత్రానా మాత ృభాషను వ్యతిరేకించినట్లుగా భావించరాదని కూడా ఉమాశంకర్ అభిప్రాయపడ్డారు. ధార్వాడలో ఇటీవల నిర్వహించిన కన్నడ సాహిత్య సమ్మేళనంలో పలువురు ప్రభుత్వ నిర్ణయాన్ని తీవ్రంగా తప్పు పట్టారు. ఈ సమ్మేళన అధ్యక్షుడు చంద్రశేఖర కంబారా సైతం ఆంగ్లం కంటే మాతృభాష పరిరక్షణకు ప్రాధాన్యమివ్వాలనే సూచన చేశారు. మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య కూడా కన్నడ మాధ్యమ పాఠశాల మనుగడకు ఈ నిర్ణయం గొడ్డలి పెట్టు అంటూ కన్నడ సాహితీవేత్తలకు వంత పాడారు. ఇదంతా తల్లిదండ్రుల అభిప్రాయాల మేరకే తీసుకున్న నిర్ణయం.. జాతీయ స్థాయి పరీక్షల్లో కన్నడ విద్యార్థులు రాణించాలంటే ఆంగ్ల మాధ్యమ పాఠశాలలు తెరవక తప్పదన్న తన గట్టి నిర్ణయాన్ని ముఖ్యమంత్రి మరో మారు సమర్థించకున్నారు. ఆ క్రమంలోనే పాఠశాలల వివరాల ప్రకటనకు సన్నద్ధమయ్యారు. ప్రజా స్పందన ఎలా ఉంటుందో వేచి చూడాలి.

మొదటి పేజీ తరువాయి

## రామలింగేశ్వరుడి సన్నిధిలో కేసీఆర్ కుటుంబం

ఆయన సతీమణి శోభ, తెరాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ దంపతులు, రాజ్యసభ సభ్యుడు సంతోష్ తదితరులు ఉన్నారు.

## కాంగ్రెస్ కాలంలో కుటుంబ పాలనకే ప్రాధాన్యత

ప్రజలు కష్టాలు పడుతున్నా.. దేశాన్ని ఎక్కువ కాలం పాలించిన కాంగ్రెస్ మాత్రం తమాషా చూస్తూ ఉండిపోయిందన్నారు. కాంగ్రెస్ నేతలకు మనుషులు మనుషులుగా కనబడటంలేదన్నారు.

1984లో దేశవ్యాప్తంగా సిక్కులను ఊచకోత కోసి ఇప్పుడు జరిగిందేదో జరిగిపోయిందని అంటున్నారని మండిపడ్డారు. ఎంతోమంది సిక్కులపై పెట్రోల్, డీజిల్ పోసి నిప్పటించారని, మెడలో టైర్లు వేసి అగ్గి పెట్టారని నాటి ఉదంతాన్నిగుర్తు చేశారు. కానీ, ఇప్పుడు మాత్రం జరిగిందేదో జరిగిపోయిందని కాంగ్రెస్ నేతలు వల్లె వేస్తున్నారంటూ తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ అహంకారంతో దేశాన్ని కాంగ్రెస్ పాలించడం వల్లే గత ఎన్నికల్లో ఆ పార్టీకి 44 సీట్లు మాత్రమే ప్రజలు ఇచ్చారన్నారు. ఈసారి ఆమాత్రం సీట్లలో కూడా కాంగ్రెస్ గెలిచేందుకు మద్దతివ్వడానికి ప్రజలు సిద్ధంగా లేరని మోదీ వ్యాఖ్యానించారు.

## ఆర్టీఐ యాక్టు ప్రకారమే నియమించాలి

చూస్తే.. లా, సైన్స్ అండ్ టెక్నాలజీ, సోషల్ సర్వీస్, మేనేజ్‌మెంట్, జర్నలిజం, మాస్ మీడియాలో అనుభవం ఉన్న వ్యక్తులనే ఆ పదవులకు ఎంపిక చేయాలి. దానికి భిన్నంగా టీడీపీ యాక్టివిస్టులను ఆర్టీఐ కమిషనర్లుగా నియమించారు. అంతేకాకుండా ఈ పదవులకు ఎంపిక అయ్యే వ్యక్తులు ఎంపీలు కానీ, రాష్ట్ర శాసనసభల్లోనూ, కేంద్రపాలిత ప్రాంతాల్లో, ఆదాయం వచ్చే పదవుల్లో, వ్యాపారాల్లోనూ ఉండకూడదు. ఎలాంటి పార్టీలతోనూ సంబంధ బాంధవ్యాలు కలిగి ఉండకూడదని ఆర్టీఐ యాక్ట్ తెలియజేస్తోంది.

## విచారణకు హాజరైన టీవీ9 మూర్తి

రవిప్రకాశ్, శివాజీ, మూర్తిలపై కేసు నమోదు చేశారు. టీవీ9 సెక్రటరీ దేవేంద్రను ప్రశ్నించిన పోలీసులు. మరోవైపు టీవీ9 కంపెనీ సెక్రటరీ దేవేంద్ర అగర్వాల్‌ను పోలీసులు ప్రశ్నించారు. కంపెనీ సెక్రటరీ సంతకాన్ని సీఈవో రవిప్రకాశ్ ఫోర్జరీ చేశారనే ఆరోపణల నేపథ్యంలో దేవేంద్ర అగర్వాల్‌ను సైబర్ క్రైమ్ పోలీసులు విచారించారు.

## ఓట్ల లెక్కింపు భాధ్యత రిటర్నింగ్ అధికారులదే

నియోజక వర్గంలోనూ ఒక ఆర్.ఓ. టేబుల్ తో పాటు మరో 14 టేబుళ్ళ పై ఓట్ల లెక్కింపు ప్రక్రియ జరుగుతుందని, పార్లమెంట్ నియోజక వర్గాల వారీగా పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు ప్రత్యేక గదిలో 4 టేబుళ్లపై జరుగుతుందన్నారు. ఇంతకు మించి అదనంగా టేబుళ్లను ఏర్పాటు చేయాలనుకుంటే సంబంధిత ప్రతిపాదనలను తమకు పంపాలని రిటర్నింగ్ అధికారులకు ఆయన సూచించారు. నియోజక వర్గాల వారీగా ఎన్నికల అధికారులు, సిబ్బంది, అభ్యర్థులు, ఏజంట్లకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజన సదుపాయాలు కల్పించేందుకు రిటర్నింగ్ అధికారులకు కాంట్రాక్టర్లను అప్పగిస్తామన్నారు. ఎంత మందికి అల్పాహారం, భోజన సదుపాయాలు కల్పించాల్సి ఉంటుంతో చూసుకోవాల్సిన భాద్యత రిటర్నింగ్ అధికారుల పైనే ఉందన్నారు. నియోజకవర్గాల వారీగా కంటెస్టింగ్ అభ్యర్థులతో సమావేశాలు నిర్వహించి ఏజంట్ల వివరాలను సత్వరమే సేకరించాలని రిటర్నింగ్ అధికారులకు ఆయన సూచించారు. కౌంటింగ్ అధికారులకు, సిబ్బందికి 18, 19 మరియు 20, 21 తేదీల్లోను రెండు విడతల్లో ఓట్ల లెక్కింపు శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తామని కలెక్టర్ తెలిపారు.

అరుకు పార్లమెంట్ నియోజక వర్గం పరిధిలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ కేంద్రంలో పడ్డ పోస్టల్ బ్యాలెట్ల వివరాలు ఇప్పటి వరకూ అందకపోవడంపై కలెక్టర్ ఆగ్రహాన్ని వ్యక్తంచేస్తూ అందుకు భాద్యులైన వారిని సస్పెండ్ చేసేందుకు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి ప్రతిపాదనలు పంపేందుకు ఫైల్ సర్క్యులేట్ చేయాలని ఆదేశించారు.

జాయింట్ కలెక్టర్ జి.సృజన, అన్ని నియోజక వర్గాల రిటర్నింగ్ అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

## ముగిసిన ఆరో దశ ఎన్నికల ప్రచారం

చేశారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల్లో ఓట్ల ద్వారా దేశ ప్రజలు తీర్పునివ్వనున్నారు. ఈవీఎంలను సిద్ధం చేశారు. ఒకవేళ అవి మొరాయిస్తే వెంటనే సరిచేయడానికి నిపుణులను నియమించారు. దేశంలోని మొత్తం 543 స్థానాల్లో మొత్తం ఏడు దశల్లో ఎన్నికలు జరుగుతున్న విషయం తెలిసిందే.

## రాష్ట్రానికి న్యాయం కోసమేటీడీపీ ధర్మపోరాటం

భాజపా వ్యతిరేకశక్తులను కూడగట్టామన్న చంద్రబాబు ... భాజపాకి ప్రత్యామ్నాయాన్ని ఏర్పాటు చేయగలిగామన్నారు. మోదీ వ్యతిరేక గాలిని దేశవ్యాప్తంగా ఉద్ధృతం చేశామని, ఓటమి నైరాశ్యంతోనే నరేంద్రమోదీ చౌకబారు వ్యాఖ్యలు చేస్తున్నారని దుయ్యబట్టారు.

అసహనంతోనే మోదీ దిగజారి మాట్లాడుతున్నారని విమర్శించారు. 26ఏళ్ల క్రితం చనిపోయిన రాజీవ్ గురించి మాట్లాడుతున్నారని, గత ఐదేళ్లలో తానేం చేశారో నరేంద్రమోదీ చెప్పాలని డిమాండ్ చేశారు. చేసింది చెప్పేందుకు ఏమీ లేదు కాబట్టే మోదీ చౌకబాబు విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు.

మోదీ ప్రధానిగా ఇకపై ఉండరని, కొత్త ప్రధాని రాబోతున్నారని స్పష్టం చేశారు. భారత రాజకీయాల్లో హుందాతనం మోదీ వల్ల కొరవడిందని, ఈవిధమైన చౌకబారు వ్యాఖ్యలు, దిగజారుడు రాజకీయాలు గతంలో లేవని సీఎం వ్యాఖ్యానించారు. మొదట్లో గుజరాత్ నమూనా అని మోదీ హోరెత్తించారని, ఇప్పుడా గుజరాత్ మోడల్ ప్రజల్లో ఘోర వైఫల్యంగా తేలిందని చంద్రబాబు విమర్శించారు.

# ఏపీలో ఠారెత్తిస్తున్న ఎండలు



అమరావతి: ఏపీలో ఉష్ణోగ్రతలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. వాయువ్య భారత్ నుంచి మధ్యప్రదేశ్, విదర్భ, తెలంగాణ మీదుగా వీస్తున్న వేడిగాలులు ప్రభావంతో ఉష్ణోగ్రతలు పెరిపోతున్నట్లు వాతావరణశాఖ తెలిపింది. ఉభయగోదావరి, గుంటూరు, కృష్ణా, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. మరో రెండు మూడు రోజులు ఇదే పరిస్థితి కొనసాగవచ్చని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. సగటున 45 నుంచి 47 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశలున్నాయని వెల్లడించింది.

మరోవైపు వేడిగాలులు తీవ్రత ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది.

ఉదయం నుంచే వేడిగాలులు వీస్తుండటంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావాలంటేనే జంకుతున్నారు. వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో చాలా చోట్ల కర్నూలు, పశ్చిమ గోదావరి, కృష్ణా, చిత్తూరు జిల్లాల్లో 45 డిగ్రీల నుంచి 47 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముందని వాతావరణశాఖ తెలిపింది. చిన్నారులు, వృద్ధులు వడదెబ్బ బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది. రాగల రెండు మూడు రోజుల్లో కోస్తంధ్ర, రాయలసీమ జిల్లాల్లోనూ చాలా చోట్ల 45 డిగ్రీలకు పైగానే ఉష్ణోగ్రతలు రికార్డు అవుతాయని వాతావరణశాఖ హెచ్చరికలు జారీ చేసింది. ఉత్తర కోస్తాంధ్రలోని కొన్ని చోట్ల మాత్రం సగటు ఉష్ణోగ్రతలు 30 నుంచి 34 డిగ్రీల మధ్య నమోదవుతున్నట్లు స్పష్టం చేసింది.

## గిరిజన భూములను దోచుకుంటున్న వారిపై
# తగిన చర్యలు తీసుకోవాలి

డాబాగార్డెన్స్: గత కొన్ని సంవత్సరాలుగా విశాఖ జిల్లా ఎగువ కొండపర్తి అనంతగిరి మండలంలో జరుగుతున్న భూదందా, భూ మాఫియా కు అడ్డుకట్ట వేయాలని జిల్లా యంత్రాంగానికి రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ మెంబర్ సివేరి అబ్రహం సూచించారు. తక్షణమే తమ గిరిజనుల భూమిని గిరిజనులకే అప్పగించాలని, సుమారు 150 ఎకరాల సాగు చేస్తున్న భూమిని తిరిగి ఇవ్వాలని సినీ నిర్మాత సురేష్ బాబు, కాంట్రాక్టర్ సాగర్ రెడ్డి గిరిజనులకు నష్టపరిహారం, భూమిని తిరిగి ఇవ్వాలంటూ లేని పక్షంలో తమ గిరిజనుల దగ్గర దోచేసిన భూమి దగ్గరే ధర్నాకు దిగి తమ వాళ్లకు అండగా ఉంటామంటూ అబ్రహం పేర్కొన్నారు. శుక్రవారం ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఆరు నెలలుగా విజయనగరం ఆర్డీవో వద్ద ఈ విషయాలన్నిటినీ ప్రస్తావించినప్పటికీ న్యాయం జరగలేదని, ఈ మధ్యకాలంలో కొన్ని టీవీల్లో, పేపర్ ఛానళ్లలో ఈ వార్తలు రావడం కూడా జరిగిందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. గిరిజనుల హక్కుల కోసం తన తండ్రి సోమ ఎన్నో పోరాటాలు చేశారని, అలాగే ప్రస్తుతం తాను కూడా గిరిజనుల వెంటే ఉంటానని పేర్కొన్నారు. గిరిజనులను భయభ్రాంతులకు గురి చేస్తున్న వారిని ప్రభుత్వం వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. తక్షణమే ఈ కేసును సుమోటోగా తీసుకొని దోషులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యపై త్వరలోనే ముఖ్యమంత్రి చంద్రబాబుకు నివేదిక ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో ఎంపిటిసి జన్నీ అప్పారావు , పిఏసిఎస్ డైరెక్టర్ రాజ్ కుమార్ పాల్గొన్నారు.

# దివిస్ ఆద్వర్యంలో తాగు నీరు సరఫరా



భీమునిపట్నం: భీమిలి మండలం చిప్పాడలో వున్న దివిస్ కంపెనీ వారు చుట్టు ప్రక్కల ప్రాంతాలలో ఉన్న పంచాయతీలలో వేసవి కాలంలో నీటి ఎద్దడిని ఎదుర్కోవడానికి కావాల్సిన చర్యలు చేపట్టామని దివిస్ అధికారులు తెలిపారు. ఇందులో భాగంగా అవంతి కాలేజ్ నుండి దివిస్ వరకు పలు చోట్ల చలివేంద్రాలు ఏర్పాటు చేసి మజ్జిగ మరియు తాగు నీరును అందిస్తున్నామని, అలాగే భీమిలీ మండలంలో నీటి ఎద్దడి ఎక్కువగా వున్న దివిస్ పరిసర ప్రాంతాలలో గల ఐదు పంచాయతీలలో ఇప్పటికే ఆర్ ఓ ప్లాంటులను ఏర్పాటు చేశామని, అలాగే భీమిలీ తగరపువలస జీవీఎంసీ పరిధిలో పలు వార్డులలో గల ఆర్ ఓ ప్లాంట్ మరమ్మతుల నిమిత్తం మూడు లక్షల రూపాయలు కేటాయించామని తెలిపారు. వాటిని రిపేర్ లు చేయించి వాడుకలోకి తెస్తామని అలాగే నీటి ఎద్దడి ఎక్కువగా ఉన్న ప్రాంతాలకు కూడా మంచినీటి ట్యాంక్‌లు పంపుతామని తెలిపారు. ప్రతిరోజు 25 నుంచి 26 వాటర్ ట్యాంకర్లతో నీటి సరఫరాను సుమారు 3,500 కుటుంబాల ప్రజలకు సామాజిక భాద్యత విభాగం అధికారులు పర్యవేక్షణలో అయా గ్రామ పెద్దల సహకారంతో పంపిణి చేస్తున్నామని కార్పోరేట్ సామాజిక విభాగం అధికారి ఈ. ఎస్ నాగరాజు తెలిపారు. ఆర్ ఓ ప్లాంట్ ద్వారా మినరల్ వాటర్‌ను కూడా అందిస్తున్నామని వాటిని పొందెందుకు వాటర్ క్యాన్ లు మరియు కార్డు లను కూడా అందించామని తెలిపారు. దివిస్ ప్రాంతంలో నీటి ఎద్దడి లేకుండా చేయడం కంపెనీ ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు.

## ముగిసిన ఆసెట్ ప్రవేశ పరీక్షలు

- ఆసెట్‌కు 88.79 శాతం హాజరు
- పరీక్ష కేంద్రాలు పరిశీలించిన రెక్టార్, రిజిస్ట్రార్‌లు



ఆంధ్ర విశ్వకళాపరిషత్: ఆంధ్రవిశ్వవిద్యాలయం, అనుబంధ కళాశాలల్లో పీజీ, సమీకృత ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే ఆసెట్, ఆఈట్ ప్రవేశ పరీక్షలు ప్రశాంతంగా ముగిసాయి. ఉదయం పలు పరీక్ష కేంద్రాలను రెక్టార్ ఆచార్య ఎం.ప్రసాద రావు, రిజిస్ట్రార్ ఆచార్య కె.నిరంజన్ పరిశీలించారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.రామ మోహన రావు వర్సిటీలోని పలు పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో ప్రవేశాల సంచాలకులు ఆచార్య నిమ్మ వెంకట రావు తదితరులు ఉన్నారు.

రెండో రోజు నిర్వహించిన ఆసెట్ ప్రవేశ పరీక్షకు 90.52 హాజరు నమోదయ్యింది. రెండో రోజు పరీక్షలకు 14064 మంది దరఖాస్తు చేయగా వీరిలో 12731 మంది పరీక్షకు హాజరయ్యారు. పరీక్షల వారీగా హాజరు శాతం పరిశీలిస్తే సమీకృత జియాలజీ,అప్లయిడ్ కెమిస్ట్రీకి 76.88 శాతం, హ్యూమానిటీస్ సోషల్ సైన్స్ 87.20శాతం, లైఫ్‌సైన్స్‌కు 91.52 శాతం, మేథమెటికల్ సైన్సెస్‌కు 88.83, కెమికల్ సైన్స్‌కు 94.29 శాతం, ఎకనామిక్స్‌కు 91.50 శాతం హాజరు నమోదయ్యింది.

ఆసెట్‌కు మెత్తం రెడురోజుల్లో 88.79 శాతం, ఆఈట్‌కు 87.30 శాతం హాజరు నమోదయ్యింది. రాష్ట్ర వ్యాప్తంగా శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, కాకినాడ, రాజమండ్రి, ఏలూరు, విజయవాడ, గుంటూరు నగరాలలోని 14 పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. విశాఖనగరంలో ఏయూ మహిళా ఇంజనీరింగ్ కళాశాల, గాయిత్రి విద్యాపరిషత్ డిగ్రీ కళాశాల, డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాల, ఆంధ్రవిశ్వవిద్యాలయం ఎంబిఏ అనెక్సర్ భవనం, ఏయూ ఆర్ట్స్ కళాశాల భవనాలలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ప్రవేశాలం సంచాలకులు ఆచార్య నిమ్మ వెంకట రావు తెలిపారు.

# స్పెషల్ సర్వయిలెన్స్ బృందాలకు ప్రజలు సహకరించాలి

- నగరంలోని ప్రతి గృహాన్ని సందర్శించనున్న బృందాలు
- ఇల్లు, ఫ్రిజ్, వాటర్ టబ్స్, షేడ్స్ మేడపైన పరిశీలన
- దోమల ఉత్పత్తి, వ్యాప్తి నిరోధం ద్వారా జ్వరాల నివారణ
- మలేరియా, సర్వయిలెన్స్ బృందాలకు సహకరించండి
- జ్వరకారక దోమలు లేకుండా ఆరోగ్య విశాఖకు దోహదం చేయండి
- శనివారం - ఆదివారాల్లో అప్రమత్తంకండి
- జివిఎంసి కమిషనర్ హరినారాయణన్

విశాఖపట్నం: జి.వి.ఎం.సి. పరిధిలోని ఎనిమిది జోన్లు వార్డులలో ప్రతి ఇంటిని సందర్శించి, పరిశీలించి దోమల ఉత్పత్తి, వ్యాప్తి చెందకుండా స్పెషల్ సర్వయిలెన్స్ నిర్వహించడం ద్వారా జ్వరాలు, దోమ కారక వ్యాధులు ప్రబలకుండా నిరోధించడానికి మలేరియా, సర్వయిలెన్స్ బృందాలు శనివారం, ఆదివారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు కమిషనర్ హరినారాయణన్ పేర్కొన్నారు. రెండు రోజుల స్పెషల్ సర్వయిలెన్స్ ద్వారా నగరంలోని అన్ని గృహాలను సందర్శించి, ఇల్లు, ఫ్రిజ్, వాటర్ టబ్స్, షేడ్స్ మేడ పైభాగంలో, పరిసరాలలో నీరు, లార్వా నిల్వ ఉండకుండా పరిశీలిస్తారని పేర్కొన్నారు. పరిసరాలలో మురుగునీరు, నీటికుంటలు లేకుండా చొరవ చూపించాలని తెలిపారు. రాష్ట్రంలోనే గత సంవత్సరం రెండు రోజుల ప్రత్యేక డ్రైవ్, సర్వయిలెన్స్ నిర్వహించడం ద్వారా దోమల ఉత్పత్తి, వ్యాప్తి నిరోధించడం ద్వారా జ్వరాలను తగ్గించగలిగినట్లు వెల్లడించారు.

ఈ సంవత్సరం కూడా ముందుజాగ్రత్త చర్యలుగా దోమకారకవ్యాధులు ప్రబలకుండా సర్వయిలెన్స్ చేపట్టినట్లు వివరించారు. జ్వరపీడితులుంటే వారిని ఆసుపత్రికి, పరీక్షలు, చికిత్స నిమిత్తం పంపించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఒక్కో ఆరోగ్య కార్యకర్త, మలేరియా కార్యకర్తలు, రోజువారి కార్మికులు ప్రతి ఇంటిని సందర్శించి వ్యాధిపట్ల అవగాహన పెంపొందించడం, కరపత్రం, స్టిక్కర్ అతికించి దోమకారక వ్యాధులు, నిరోధం గురించి ప్రజలకు తెలియజేస్తారు. ఒక్కో కార్యకర్త రోజుకు 60 గృహాలను సందర్శించి సర్వయిలెన్స్ చేపడతారు. ప్రత్యేక అధికారులు, జోన్ ప్రత్యేక అధికారులు, వార్డు ప్రత్యేక అధికారులు పర్యవేక్షిస్తారని పేర్కొన్నారు.

కావున నగర ప్రజలు స్పెషల్ సర్వయిలెన్స్ బృందాలకు సహకరించి దోమలు ఉత్పత్తి, వ్యాప్తి చెందకుండా, దోమకారక వ్యాధులైన డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యాలు విజృంభించకుండా దోహదపడాలని విజ్ఞప్తి చేశారు. ఆరోగ్యమే మహాభాగ్యం, విశాఖ నగరాన్ని ఆరోగ్య నగరంగా తీర్చిదిద్దండి.

# డాక్టర్ సన్యాశినాయుడుకు జాతీయ స్థాయి అవార్డు



ఆంధ్ర విశ్వకళాపరిషత్: ఆంధ్రా యూనివర్సిటీలోని జియోఇంజనీరింగ్ విభాగంలో డాక్టరేట్ పూర్తిచేసిన డాక్టర్ దాడి సన్యాశి నాయుడుకు జాతీయ స్థాయి అవార్డు లభించింది. ఇంటర్నేషనల్ ఫోరం ఫర్ రీసెర్చ్ ( యంగ్ రీసెర్చ్‌ర్స్ ఫోరం ) సంస్థ తరపున అవార్డుకు ఎంపికయ్యారు. జిఐఎస్ అండ్ జియో ఇన్‌ఫర్‌మోటిక్స్ అంశంపై అపార అనుభవానికి ఈ గుర్తింపు లభించింది. ముఖ్యంగా జిఐఎస్ ద్వారా సహజ వనరుల గుర్తింపు, దాని అభివృద్ధి, నీటి నిల్వలు, భూగర్భ జలాలను గుర్తించి వాటి సద్వినియోగం, ప్రజలకు నీటి అవసరాలను తీర్చే విధంగా సాంకేతిక సేవలు అందించడంలో డాక్టర్ సన్యాశినాయుడు సఫలీకృతం అయ్యారు. ప్రస్తుతం ఉపయోగిస్తున్న కంప్యూటర్ ప్రోగ్రామింగ్‌తో కాకుండా డాట్‌నెట్‌ను ఉపయోగించి విజబులిటీ ద్వారా మరింత మెరుగైన సేవలు అందించేలా కృషి చేస్తున్నారు. స్మార్ట్ సిటీ అభివృద్ధిలో జిఐఎస్‌ను ఉపయోగించి మరింత మేలైన పురోగతి సాధించడానికి ఏవిధంగా దోహదం చేస్తుందో డాక్టర్ సన్యాశినాయుడు తన పరిశోధనలద్వారా తెలిపారు. గత ఐదేళ్ల కాలంలో 20 పరిశోధనా పత్రాలు ఆచార్య జగదీశ్వరరావు పర్యవేక్షణలో ప్రచురించారు. విజయనగరం జిల్లా ఎస్‌కోటకు చెందిన డాక్టర్ సన్యాశినాయుడు ప్రస్తుతం అమెరికాలోని వర్జీనియాలో సీనియర్ డవలపర్‌గా విధులు నిర్వహిస్తున్నారు.ఈ సందర్భంగా విభాగ ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు డాక్టర్ సన్యాశినాయుడును ప్రత్యేకంగా అభినందించారు.

## జోనల్ కమిషనర్‌కు వినతి పత్రం



భీమునిపట్నం: తగరపువలస బంగ్లా మెట్ట వద్ద ఉన్న స్మశాన వాటికకి అనేక సమస్యలు ప్రజలు ఎధురుక్కొంటున్నారని స్మశాన వాటికకి వెళ్లే మార్గంలో చెత్తా చెదారం తో మార్గం మూసుకుపోయిందని స్మశాన వాటిక ప్రహరి గోడ సగం లో ఆపారని అలాగే అక్కడ వున్న బోర్ కూడా పనిచేయడం లేదని చుట్టూ ముళ్ళ పొదలు ఉండడం వల్ల ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని జనసేన పార్టీ నాయుకులు, కార్యకర్తలు జోనల్ కమీషనర్ సి.హేచ్.గోవిందరావుకు వినతి పత్రం అందజేసారు.

# ఇచ్చిన వార్డన్‌లకే మళ్ళీ మళ్ళీ ఇవ్వొద్దు



అరకు: మన్యం గిరిజన ఆశ్రమ పాఠశాలలో గతేడాది వార్డన్ పోస్టు కొనసాగిన వార్డన్ లకే మళ్ళీ మళ్ళీ స్థాన చలనం మార్చి వార్డన్ పోస్టు ఇవ్వడం వలన హాస్టల్ పద్దతులు మారదు, మళ్ళీ, మళ్ళీ పాత పద్దతిలోనే మెనూ ఉంటుంది, హాస్టల్ తీరులు మారదని పలువురు అంటున్నారు. కొన్ని ఆశ్రమ పాఠశాలల్లో అయితే సక్రమంగా సరైన బోజనం, విద్యార్థులకు పెట్టడం లేదు. మెనూలో ఒకటి ఉంటే ఒకటి పెడుతున్నారు. రోజూ పెట్టే కూరయే నెలల తరబడి పెడుతున్నారు, మెనూ మార్చడం లేదని పలువురు అంటున్నారు. దీనివల్ల కొంతమంది విద్యార్థులు హాస్టల్ విడిచి ఇంటి బాట పడుతున్నారని, గతేడాది వార్డన్ పోస్టులో కొనసాగిన వార్డన్‌లను మళ్ళీ వార్డన్ పోస్టు ఇవ్వడంతో ఈ అన్యాయం జరుగుతోందని పలువురు వాపోతున్నారు. ఐ.టి.డి.ఏ పరిదిలో ఉన్న విద్యాశాఖ అధికారులు భారీగా ముడుపులు పుచ్చుకొని వార్డన్ పోస్టులు ఇచ్చినా వారికే మళ్ళీ మళ్ళీ కట్టబెడుతున్నారని పలువురు అంటున్నారు.

## ఉచిత వేసవి కరాటే శిక్షణా తరగతులు ప్రారంభం

భీమునిపట్నం : ఇండియన్ కొరియన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత కరాటే శిక్షణ తరగతులు నిర్వహించబడునని అసోసియేషన్ చీఫ్ కోచ్ ఎం. వెంకటరమణ యాదవ్ తెలిపారు. ఈ శిక్షణా తరగతులు ఈనెల 31వరకూ ఉదయం 6నుంచి 7.30 వరకూ అలాగే సాయంత్రం 6 నుంచి 7.30 వరకూ రెండుపూటలా నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ శిక్షణా శిబిరాలు భీమిలి కేంబ్రిడ్జ్ స్కూల్, గాయత్రి గుడి వద్ద నోవస్ లేఅవుట్, గొల్లలపాలెం జివిఎంసి ప్రైమరీ స్కూల్ లో, బ్యాంక్ కాలనీ జెజె ఫవర్ జిమ్ లో, అదేవిధంగా సంగివలస మూడు అమ్మవార్ల గుడి ఎదురు అనిట్స్ బస్ స్టాప్ వెనుక ఈ శిక్షణా శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఆసక్తి గల 5 సంవత్సరాల నుంచి 14 సంవత్సరాల వయసు ఉన్న యువతీ యువకులు ఈ ఫోన్ 9030557785 నంబర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.

# దేశంలోనే వి.జె.ఎఫ్. సేవలు ఆదర్శనీయం

### విశాఖ ప్రెస్‌క్లబ్‌లు సందర్శించిన తిరుపతి ప్రెస్‌క్లబ్ జర్నలిస్టుల బృందం
### అతిథుల చేతులమీదుగా ఘనంగా సన్మాన, సత్కారాలు



విశాఖపట్నం : జర్నలిస్టుల ఆదరణ, సంక్షేమ కార్యక్రమాల్లో వైజాగ్ జర్నలిస్టుల ఫోరమ్ దేశంలోనే ఆదర్శవంతమైనదని సెంచురియన్ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య జి.ఎస్.ఎన్. రాజు కొనియాడారు. శుక్రవారం తిరుపతి జర్నలిస్టుల బృందం విశాఖ సందర్శన సందర్భంగా డాబాగార్డెన్స్ వి.జె.ఎఫ్. ప్రెస్‌క్లబ్, సీతమ్మధార వి.జె.ఎఫ్. వినోదవేదికలను సందర్శించింది. ఈ సందర్భంగా వి.జె.ఎఫ్. ఏర్పాటుచేసిన అభినందన సభలో ఆచార్య జి.ఎస్.ఎన్. రాజు మాట్లాడుతూ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఏ ప్రెస్‌క్లబ్ నిర్వహించని కార్యక్రమాలను వి.జె.ఎఫ్. నిర్వహిస్తుండటం అభినందనీయమన్నారు. ఇతర జిల్లాల నుంచి వచ్చే జర్నలిస్టులకు సత్కరించి అతిథ్యం ఆదర్శనీయటమన్నారు. గౌరవ అతిథిగా హాజరైన ఐ అండ్ పిఆర్ డిప్యూటీ డైరెక్టర్ మణిరామ్ మాట్లాడుతూ క్రీడా, సాంస్కృతిక, ఆరోగ్య సంక్షేమ కార్యక్రమాల నిర్వహణలో వి.జె.ఎఫ్. నెం.1గా పేరు ప్రతిష్టలు దక్కించుకుందన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన వి.జె.ఎఫ్. అధ్యక్షులు గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ దేశ విదేశాలకు చెందిన అనేక ప్రెస్‌క్లబ్‌లతో వి.జె.ఎఫ్.కు సన్నిహిత సంబంధాలున్నాయన్నారు. నేపాల్, తిరువనంతపురం, ఎర్నాకులం, కోలకత్తా, సింగపూర్ తెలుగు సమాజం, మలేషియా జర్నలిస్టుల అసోసియేషన్‌తో పాటు అనేక ప్రాంతాల్లో ప్రెస్‌క్లబ్‌లు వి.జె.ఎఫ్. కార్యక్రమాలను ఆదర్శనీయంగా తీసుకోవడం గర్వకారణంగా వుందన్నారు. మీడియా సోదరులు నిత్యం ఉత్సాహంగా వుండాలనే అనేక సంక్షేమ కార్యక్రమాలను విస్రృతంగా నిర్వహిస్తున్నామన్నారు. వి.జె.ఎఫ్. కార్యదర్శి ఎస్. దుర్గారావు మాట్లాడుతూ సభ్యుల ప్రోత్సాహంతోనే అనేక కార్యక్రమాలను విజయవంతంగా పూర్తిచేస్తున్నామన్నారు. భవిష్యత్‌లో కూడా మరిన్ని కార్యక్రమాలు చేపట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. వి.జె.ఎఫ్. ఉపాధ్యక్షులు ఆర్. నాగరాజు పట్నాయక్ మాట్లాడుతూ జూన్ 9న జర్నలిస్టుల పిల్లలకు ఉపకార వేతనాలు, విధినిర్వహణలో ప్రతిభాపాటవాలు చూపిన జర్నలిస్టులకు అదేరోజు మీడియా అవార్డులు అతిథుల చేతులమీదుగా ప్రదానం చేస్తామన్నారు. తిరుపతి ప్రెస్‌క్లబ్ నాయకులు ప్రకాష్, రాధాకృష్ణ, శివలు మాట్లాడుతూ వి.జె.ఎఫ్. సేవలు ప్రశంసనీయమన్నారు. ఇక్కడ పాలకవర్గం చేపట్టే కార్యక్రమాలు రాష్ట్రవ్యాప్తంగా ఆదర్శనీయంగా నిలిచాయన్నారు. ఈ కార్యక్రమంలో ద్వారకాపోలీస్ స్టేషన్ ఎస్.ఐ. లూథరన్, ఉపాధ్యక్షులు నానాజీ, సభ్యులు వరలక్ష్మి, ఎం.ఎస్.ఆర్. ప్రసాద్, శేఖరమంత్రి, డేవిడ్‌రాజ్, తదితరులంతా పాల్గొన్నారు. ఈ సందర్భంగా తిరుపతి నుంచి విచ్చేసిన ప్రెస్‌క్లబ్ కార్యవర్గసభ్యులు వారి కుటుంబ సభ్యులను అతిథుల చేతులమీదుగా ఘనంగా సత్కరించారు.

# త్వరలో పర్మినెంట్ సీనియర్ సివిల్ జడ్జి కోర్ట్

భీమునిపట్నం: భీమిలి న్యాయవాదుల సంఘం కార్యవర్గ సభ్యుల పరిచయ కార్యక్రమం జరిగింది,

ఈ కార్యక్రమానికి అద్యక్షత వహించిన న్యాయవాదుల సంఘం అద్యక్షుడు ఎన్ జనార్ధన్ రావు మాట్లాడుతూ ఈ ఏడాదిలోనే భీమిలి కి పర్మినెంట్ సినియర్ సివిల్ జడ్జి కోర్ట్ రానున్నదని దీనితో పాటు ఇంకొక అదనపు సినియర్ సివిల్ జడ్జి కోర్ట్ విశాఖపట్నం నుంచి భీమిలికి తరలింపునకు ప్రయత్నం చేస్తున్నామని, అలాగే భీమిలి జూనియర్ సివిల్ జడ్జి కోర్ట్ పరిధిలో గల అనేక కేసులు ఇంత వరకు ఇక్కడ సినియర్ సివిల్ జడ్జి కోర్ట్ లేకపోవడం వల్ల విశాఖలో దాఖలు చేయవలసి వస్తుందని భీమిలి పరిదిలో సుమారు 1800 కేసులు విశాఖపట్నం సినియర్ సివిల్ జడ్జి కోర్ట్‌లో ప్రస్తుతం నడుస్తున్నాయని భీమిలి కి కొత్త సినియర్ సివిల్ జడ్జి కోర్ట్ వచ్చిన యెడల ఈ ప్రాంత కక్షిదారులకు అనుకూలంగా ఉండమే కాకుండా కేసులు త్వరితగతిన పరిష్కారమయ్యే అవకాశం ఉందని ఆయన అన్నారు.

ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ వైస్ ప్రేసిడెంట్ బమ్మిడి సూర్యనారాయణ, సహయ కార్యదర్శి బోర సూర్య ప్రకాష్ రెడ్డి, కార్యదర్శి ఎం.సునీల్, కార్యవర్గ సభ్యులు బి.అప్పలరాజు, తెడ్డు రాందాసు, వి.అరుణ కుమారి, సినియర్ న్యాయవాధి పి.వెంకటేష్ తదిరులు పాల్గొన్నారు.

# విజ్ఞానదాయకంగా విశాఖ చిల్డ్రన్స్ క్లబ్‌లో సమ్మర్ క్యాంపులు




గాజువాక: చిన్నారులలో విజ్ఞానాన్ని పెంపొందించడానికి, క్రీడలద్వారా శరీర దృఢత్వాన్ని పెంపొందించడానికి సమ్మర్ క్యాంపులు ఎంతో ఉపయోగపడతాయని స్టీల్‌జోన్ కన్వీనర్ కె.సుశీల అన్నారు. స్టీల్‌జోన్‌లో విశాఖ చిల్డ్రన్స్ క్లబ్ ఆద్వర్యంలో సమ్మర్ క్యాంపులు ఈ నెల 27వ తేదీనుంచి వేసవి వినోదం ప్రారంభమైయ్యి, ఎంతో విజ్ఞానదాయకంగా నడుస్తున్నాయని ఆమె ఒక ప్రకటనద్వారా తెలిపారు. కథలు చెప్పడం, పాటలు పాడించడం, డాన్స్, పూలు,పండ్లు కూరగాయలతోఆటలు, ఫన్ మ్యాథ్స్ వాటిలో పుట్టిన తేదీ, నెల కనుక్కోవడం, ఏ నంబర్స్ ఐనా సులువుగా కలపడం, తీసివేయడం, మిస్సింగ్‌నంబర్స్, ఓరిగామి, మ్యాజిక్, ప్లానెట్స్ కనిపెట్టడం, చెప్పించడం, బొమ్మలు చయడం, నేర్పించడం తదితర విజ్ఞాణ దాయకమైనవి నేర్పించారు. అనేకమంది వలంటీర్లు దీనికోసం శిక్షణ పొంది ఆయాప్రాంతాలలో వున్న చిన్నారులతో ఈ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేశపాత్రునిపాలెం, వడ్లపూడి, అగనంపూడి, పెదకోరాడ, చినకోరాడలలో ఈ కార్యక్రమాలు ప్రారంభమైనట్లు తెలిపారు. అంతేకాకుండా నింగినేలనాదే అనే సినిమా ప్రదర్శించారు. ఈ కార్యక్రమాలకు క్లబ్ బాధ్యులుగా వరలక్ష్మి, రాము, శ్రీను,రమణ,రాముడు నిర్వహించగా, పిల్లల వాలంటీర్లు రోషిని, దిలీప్, కావ్య, దినేష్, హారిక, చంద్రిక, దీపిక, నేర్పించారు. ప్రజానాట్యమండలి నుంచి ఎల్లాజీ నృత్యాన్ని నేర్పించినట్లు తెలిపారు.

# వ్యాసరచన పోటీలు

భీమునిపట్నం : గౌతమ బుద్ధుని జయంతి పురస్కరించుకుని ఆదర్శ హిందీ ప్రేమీమండలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్ కృష్ణారావు ఆధ్వర్యంలో జిల్లా స్థాయి వ్యాసరచన పోటీలు ఈ నెల 13న గౌతమ బుద్ధుని జీవిత విశేషాలపై తెలుగు, హిందీ భాషలలో స్థానిక పండిట్ నెహ్రు జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను మే 18న బీచ్ వద్ద గౌతమ బుద్ధుని జయంతి రోజున ఆయన విగ్రహం వద్ద బహుమతులు అందజేస్తామని ఆయన తెలిపారు.

# విజయభాను సంపాదకీయం

## ఫేక్‌న్యూస్‌కు చెల్లుచీటీ

సామాజిక మాధ్యమాల్లో బోగస్ వార్తలపై బీబీసీ చేసిన పరిశోధన భీతిగొలిపే విషయాలను బయటపెట్టింది. జాతీయవాదం, దేశభక్తి పేరుతో బోగస్ వార్తలు యథేచ్ఛగా ప్రచారమవుతూ విస్తరిస్తూ యువతను తీవ్రస్థాయిలో ప్రభావితం చేస్తున్నాయని తెలిపింది. ప్రపంచవ్యాప్తంగా ముఖ్యంగా ఆఫ్రికా ఖండంలోని కెన్యా, నైజీరియాతోపాటు భారత్‌లో బీబీసీ వరల్డ్ సర్వీస్ గ్రూప్ బియాండ్ ది ఫేక్ న్యూస్ పేరిట చేసిన అధ్యయనంలో అనేక ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చాయి. బీబీసీ 16వేల ట్విటర్ ఖాతాలు, 3,200 ఫేస్‌బుక్ సమాచారాల ఆధారంగా అధ్యయనం చేసి బోగస్ వార్తల ప్రమాదాన్ని ప్రపంచానికి తెలియజెప్పింది. సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టే ఈ బోగస్ (అసత్య) సమాచారాల మూలంగానే జాతి సమూహాల మధ్య వైరాలు ఉత్పన్నమవుతున్నాయని ఆందోళన వ్యక్తంచేసింది. ఈ బోగస్ వార్తల విషయం, ప్రపం చవ్యాప్తంగా వాటి ప్రభావం గురించి విస్తృతంగా చర్చ జరుగుతున్నది. ఈ క్రమంలోనే టీవీ, రేడియోతో పాటు డిజిటల్ విప్లవం కారణంగా అందుబాటులోకి వచ్చిన సామాజిక మాధ్యమం లో వార్తల పేరిట చెలామణి అవుతున్న బోగస్ వార్తల ప్రమాదంపై ఆందోళన వ్యక్తమవుతున్న ది. బోగస్ వార్తలపై చర్చ జరుగటమే కాదు, కట్టడి అవసరాన్ని ప్రపంచవ్యాప్తంగా అన్నిదేశాలు గుర్తించటం గమనార్హం. ప్రపంచవ్యాప్తంగా సామాజిక మాధ్యమాలను అతి ఎక్కువగా వినియోగిస్తున్న వారిలో చైనా తర్వాత భారతదేశమే ద్వితీయ స్థానంలో ఉన్నది. ఇటీవలికాలంలో విస్తృతంగా వినియోగంలోకి వచ్చిన స్మార్ట్‌ఫోన్ల వినియోగం కారణంగా సామాజిక మాధ్యమం అందరికీ అందుబాటులోకి రావటమే కాకుండా, అతి బలీయమైన శక్తిగా రూపొందింది. ఈ నేపథ్యంలోనే దేశంలోనూ ప్రధాన పార్టీలన్నీ సామాజిక మాధ్యమాలను తమకు అనుకూలంగా వినియోగించుకునేందుకు ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేసుకున్న తీరు కనిపిస్తున్నది. 2018 మార్చి వరకు భారత్‌లో దాదాపు ఐదు కోట్ల మంది ఈ సేవలను వినియోగిస్తున్నట్లు తేలింది. అమెరికా కన్నా భారత్‌లోనే స్మార్ట్ ఫోన్లు ఎక్కువగా వాడుతున్న తీరు సామాజిక మాధ్యమాల విస్తరణకు తార్కాణంగా చెప్పుకోవచ్చు. సామాజిక మాధ్యమం ప్రజల ఆలోచనా ధోరణులను తీవ్రంగా ప్రభావితం చేస్తున్న వైనం కనిపిస్తున్న ది. అదే సమయంలో కొందరు జాతీయవాద సందేశాలున్న వార్తలను షేర్ చేయటాన్ని తమ బాధ్యతగా భావిస్తున్నారు. సోషల్ మీడియాలో బోగస్ వార్తలు వ్యాప్తి చేస్తున్న గ్రూపులకు, ప్రధాని మోదీ మద్దతుదారులకు మధ్య సంబంధ మున్నదని బీబీసీ పేర్కొనటం గమనించాల్సి న అంశం. అలాగే బోగస్ వార్తలను వ్యాప్తి చేయటంలో ట్విటర్‌లోని హిందుత్వ గ్రూపులు వామపక్ష భావజాలమున్న వారికన్నా ఎక్కువ సమన్వయంతో పనిచేస్తుండటం గమనార్హం. బోగస్ వార్తలు సాధారణంగా నిజానికి, అబద్ధానికి మధ్య ఉన్న సన్నని విభజన రేఖను మాయం చేస్తున్న వైనం కనిపిస్తున్నది. బోగస్ వార్తలు అబద్ధాలను నిజాలుగా భ్రమింపజేస్తున్నాయి. జాతీయత, దేశభక్తి పేర భావోద్వేగాలను రెచ్చగొడుతూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయి. ఇలాంటి బోగస్ వార్తల ప్రచారం మూలంగానే ఇటీవలి కాలంలో మూక హత్యలు పెచ్చరిల్లాయి. పిల్లలను కిడ్నాప్ చేసే ముఠాలు తిరుగుతున్నాయనీ, పిల్లలకు మత్తుమందు ఇచ్చి అపహరిస్తున్నారనే ప్రచారం దేశవ్యాప్తంగా సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారమైంది. ఈ నేపథ్యంలోనే ఆ మధ్య నాందేడ్‌లో ఓ ఔత్సాహికుడు తన పుట్టిన రోజున పిల్లలకు మిఠాయిలు పంచిపెడుతున్నప్పుడు, అతడిని కిడ్నాపర్‌గా అనుమానపడి రాళ్లతో కొట్టిచంపిన వైనం దేశవ్యాప్తంగా సంచలనం రేపింది. గో రక్షకుల పేరిట, గో మాంసం పేరిట జరిగిన హత్యలు ఆ కోవలోనివేననేది మరువరాదు. రెండేండ్ల కిందటి దాకా ఫేక్ న్యూస్ అనేది పెద్ద విషయంగా ప్రచారంలోకి రాలేదు. కానీ ఏడాది తిరిగేనాటికి ఫేక్ న్యూస్‌అనేది ఆ సంవత్సరంలో అత్యంత ప్రభావితం చేసిన పదంగా ఘనత సాధించింది. ఇవ్వాళ ప్రజాస్వామ్యానికే అతిపెద్ద ప్రమాదంగా పరిగణించే స్థితి వచ్చింది. 2016లో జరిగిన అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో సోషల్ మీడియా తీవ్రంగా ప్రభావితం చేసి అభ్యర్థుల జయాపజయాలను శాసించిందన్న ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలోంచే సామాజిక మాధ్యమాల్లో బోగస్ వార్తల కట్టడికి ఆయా సంస్థల అధిపతులను నిలదీసినప్పుడు వారంతా కట్టె ఇరుగకుండ, పాము చావకుండా అన్న చందాన సమాధానమిచ్చారు. ఫేక్ న్యూస్‌ను కట్టడి చేస్తామని ట్విటర్ చెబితే, ఫేస్‌బుక్ అలాంటి వాటిని గుర్తిస్తే తొలిగిస్తామని చెప్పుకొచ్చింది. గూగు ల్ సంస్థ మాత్రం బోగస్ వార్తల కట్టడికి అనేక పరిమితులున్నాయని తప్పించుకునే ప్రయత్నం చేసింది.

## 70 ఏళ్ల తర్వాత అరుదైన సరీసృపం గుర్తింపు



ఈటానగర్: అరుణాచల్ ప్రదేశ్‌లోని పశ్చిమ కమెంగ్ జిల్లాలో పరిశోధకులు ఓ అరుదైన సరీసృప జాతికి చెందిన పామును గుర్తించారు. ముదురు ఎరుపు-గోధుమ రంగులతో ఉండే ఈ అరుదైన జాతికి చెందిన సరీసృపాన్ని పిట్ వైపర్స్ అని పిలుస్తారు. భారత్‌లో ఇటువంటి పాములను ఇంతకు ముందు కేవలం నాలుగింటిని మాత్రమే గుర్తించారు. ఆ నాలుగింటిని 70 ఏళ్ల క్రితం గుర్తించారు. తాజాగా, విట్ వైపర్స్ జాతికి చెందిన పామును అశోక్ కెప్టెన్ నేతృత్వంలోని సరీసృప శాస్త్ర అధ్యయన పరిశోధకులు గుర్తించారు. ఈ విషపూరిత పాముకి ప్రత్యేకమైన హీట్ సెన్సింగ్ ఉంటుందని తెలిపారు. ఈ విషయంపై అక్కడి అటవీశాఖ అధికారులు శుక్రవారం ప్రకటన చేశారు.

అరుణాచల్ ప్రదేశ్‌లో పిట్ వైపర్స్ ఉన్నాయన్న విషయం ఇంత వరకు తెలియదు. ఈ అరుదైన సరీసృపాలపై చేసే మరిన్ని సర్వేలు, పరిశోధనలు పలు విషయాలను తేలుస్తాయి. వాటి అలవాట్లు, అవి తీసుకునే ఆహారం, సంతానోత్పత్తి, అవి గుడ్లు పెడతాయా? లేదా? అన్న విషయాలను తెలుసుకోవాల్సి ఉంది అని పరిశోధకులు తెలిపారు. పుణెకు చెందిన ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ బృందం అరుణాచల్ ప్రదేశ్‌లో జీవవైవిధ్య సర్వే నిర్వహిస్తున్న నేపథ్యంలో ఈ పాము వారికి కనపడింది. ఆ బృందానికి అటవీ ప్రాంతంలోని రందా గ్రామంలో ఓ వ్యక్తి.. ఆ పామును చూపించడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. దీనిపై మరిన్ని పరిశోధనలు చేయనున్నారు.

## ఆ పాచిక వెనుక దీర్ఘ కాలిక వ్యూహమే దాగుంది : జ్యోతిరాదిత్య

మధ్యప్రదేశ్ : యూపీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఒంటరిగానే పోటీ చేయడంపై యూపీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ జ్యోతిరాదిత్య సింధియా స్పందించారు. అలా ఒంటరిగానే వెళ్లడంపై దీర్ఘకాలిక వ్యూహాలే దాగున్నాయని వెల్లడించారు. 2014 ఎన్నికల కంటే రాష్ట్రంలో మెరుగైన ఫలితాలే సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. తమ స్వశక్తితో రాష్ట్రంలో ఎదగడానికి వ్యూహాలు పన్నుతున్నామని, ఆ వ్యూహం నుంచి వెనక్కు తగ్గే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. ఫలితాలు వచ్చిన తర్వాత తాము తీసుకున్న నిర్ణయం సరియైనదో, కాదో అనేది చూస్తారని, పార్టీ ప్రయోజనాల దృష్ట్యానే ఈ పాచిక వేశామని ఆయన వెల్లడించారు. గత ఎన్నికల కంటే ఈసారి ఎన్నికల్లో చాలా కష్టపడ్డామని, ఆ కష్టానికి ఫలితాన్నిచ్చేది మాత్రం ప్రజలేనని ఆయన అన్నారు.

మహాగట బంధన్ తో కాంగ్రెస్ పార్టీ రాజకీయంగా నష్టపోతుందా? అన్న వ్యాఖ్యలపై స్పందిస్తూ... అలాంటిదేమీ లేదని పార్టీ అభ్యర్థుల బలాబలాల మీద ఆధారపడి ఉంటుందని ప్రకటించారు.

## కర్నాటకలో ప్రభుత్వ పతనం ఖాయం: మాజీ సీఎం

బెంగళూరు: ఈనెల 23 తర్వాత రాష్ట్రంలో సంకీర్ణ ప్రభుత్వం తానంతట అదే కుప్పకూలనుందని, అనంతరం బీజేపీ అధికార పగ్గాలు చేపట్టనుందని మాజీ సీఎం జగదీశ్‌శెట్టర్ జోస్యం చెప్పారు. హుబ్బళ్ళిలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ సిద్దరామయ్య మళ్ళీ సీఎం అంటూ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు తెరపైకి తెచ్చిన కొత్త నినాదంతో సంకీర్ణ ప్రభుత్వంలో భారీ ముసలం ఏర్పడిందన్నారు. లోక్‌సభ ఎన్నికలు ముగిసేంతవరకు వేచిచూడండి అంటూ.. ఇంతవరకు సిద్దరామయ్య చేసిన వ్యాఖ్యానాలకు ఇప్పుడు అర్థం తేటతెల్లం అవుతోందన్నారు.

కాంగ్రెస్-జేడీఎస్ నేతల్లో మంత్రుల స్థాయిలోనూ, ఎమ్మెల్యేల స్థాయిలోనూ కుమ్ములాటలు ప్రారంభమయ్యాయన్నారు. కాగా చించోళి, కుందగోళ నియోజకవర్గాలలో గెలుపుకోసం కాంగ్రెస్ అడ్డదారులు తొక్కుతోందని శెట్టర్ ఆరోపించారు.

మంత్రి డి.కె.శివకుమార్ స్వయంగా తమ కార్యకర్తలను వలలో వేసుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. కనకపుర తరహా గూండాగిరి ఇక్కడ సాగదని ఆయన హెచ్చరించారు. బీజేపీ అంతర్గత వ్యవహారాలలో జోక్యం చేసుకోవడం తక్షణం నిలిపివేయాలని లేదంటే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని ఆయన హెచ్చరించారు.

రాష్ట్రంలో కరువు పరిస్థితి అత్యంత దారుణంగా ఉన్నా ముఖ్యమంత్రికి ఇవేమీ పట్టడం లేదన్నారు. ప్రజాసమస్యలను గాలికి వదిలి దేవాలయాలను ప్రదక్షిణ చేస్తుండడం దారుణమన్నారు. వైమానికదాడుల సందర్భంగా పాకిస్థాన్‌లో ఉగ్రవాదులెవరూ చనిపోలేదంటూ ప్రతిపక్షాలు చేస్తున్న వాదనను ఇటలీ జర్నలిస్టు ఒకరు జరిపిన పరిశోధన తోసిపుచ్చేలా చేసిందన్నారు.

## లోక్‌సభ ఫలితాల తర్వాత శాసనసభ ప్రత్యేక సమావేశాలు

బెంగళూరు: జూన్ మొదటివారంలోనే శాసనసభ సమావేశాలను ఏర్పాటు చేయడం ద్వారా కరువు తదితర సమస్యల నుంచి ప్రతిపక్షాల దృష్టిని పూర్తిగా మరల్చాలని సీఎం భావిస్తున్నారు. పైగా శాసనసభ సమావేశాలను ఏర్పాటు చేస్తే ఎమ్మెల్యేలంతా అందుబాటులో ఉంటారని కొందరు కాంగ్రెస్, జేడీఎస్ ఎమ్మెల్యేల్లో నెలకొన్న అసంతృప్తిని చల్లార్చేందుకు కూడా ఈ సమావేశాలు దోహదపడతాయని ఆయన భావిస్తున్నారు. మాజీ ప్రధాని, జేడీఎస్ జాతీయ అధ్యక్షుడు హెచ్.డి.దేవేగౌడ కూడా ఇదే విధమైన సలహా ఇచ్చినట్లు తెలుస్తోంది. కాగా సిద్దరామయ్య మళ్ళీ ముఖ్యమంత్రి పీఠం అధిష్ఠాంచాలంటూ కొందరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, మంత్రులు వరుసపెట్టి చేస్తున్న ప్రకటనలతో సంకీర్ణ ప్రభుత్వ మనుగడ మరింత ప్రశ్నార్థకంగా మారింది. శాసనసభ వేదికగానే అన్ని సమస్యలకు తెరదించాలని సీఎం నిర్ణయించుకున్నట్లు సమాచారం.

ఇదిలా ఉండగా లోక్‌సభ ఎన్నికల అనంతరం మాజీ ముఖ్యమంత్రి సిద్దరామయ్య కేంద్రబిందువుగా రాష్ట్ర రాజకీయాలు ఒక్కసారిగా కొత్త మలుపు తిరిగే సంకేతాలు కనిపిస్తున్నాయి. జేడీఎస్‌కు చెందిన అత్యంత సీనియర్ నేత, మాజీ మంత్రి బసవరాజ్ రట్టి గురువారం సిద్దరామయ్యతో చర్చలు జరపడం రాజకీయంగా కుతూహలం రేకెత్తిస్తోంది. కాగా కాంగ్రెస్ అసంతృప్తి ఎమ్మెల్యేలు కూడా సిద్దరామయ్య సీఎం అయితే తమ వైఖరిని మార్చుకునేందుకు సిద్ధంగా ఉన్నట్లు సంకేతాలు పంపినట్లు తెలుస్తోంది.

## నెల్లూరు జిల్లాలో వడదెబ్బకు ఇద్దరు మృతి

నెల్లూరు: జిల్లాలో వడదెబ్బకు ఇద్దరు మృతి చెందారు. తడకు చెందిన రామయ్య, బుజ్జయ్య ఇద్దరు వ్యక్తిగత పనులపై బయటకు వెళ్లారు. అయితే విపరీతమైన ఎండలతో వీరు సొమ్మసిల్లిపోయారు. కాసేపటికే ప్రాణాలు విడిచారు. ఉదయం నుంచే రాష్ట్రం అగ్నిగుండంగా మారుతోంది. మరో రెండు రోజులు ఎండ మంటలు తప్పవని నిపుణులు హెచ్చరిస్తున్నారు. గురువారం ఏకంగా 52ప్రాంతాల్లో 45- 47 డిగ్రీల మధ్య, 225 ప్రాంతాల్లో 43-45 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. తాడేపల్లిగూడెంలో అత్యధికంగా 47డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. జంగమహేశ్వరపురంలో 44.6, కావలిలో 44.4డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

## కవి సమయం

### ఇబ్బందే

ఉన్నత చదువులు చదివేము-ఫలితం అంతంతే...?
కొందరు వరకే ఫలితం ఇంతంతే...
కమ్మరి శాల్లో సమ్మెట్టేద్దామంటే... పనిలేదు
మోపులు మోస్తామంటే... చేతారపని కరువే...
'కబలం' రెండు పూటలు కలిమేది?
సవ్యంగ పాలన విధానం విధులేవి?
ఓటులు రాజ్యం వ్యాపారం
ఆకాశం తాకిన ధరలే...
చూద్దాం ఎన్నాళ్ళో - బతికి నన్నాళ్ళు...
మారేదంది- ముందుంది
ఆ... జనాలతో నడుస్తుంది
సుభిక్ష పాలన అంటుంది
మత్తుకు (నిసానీరు) అలవాటు - కొందరంటు
అనారోగ్యాలుతో వారంటు- మందులు మింగుట కర్మంటు
శాస్త్రవేత్తలు విజ్ఞానం - ఎన్నెన్నో విధాలు
ప్రపంచానికే వెలుగులు - వారి మార్గాలు
దేవతలంత ఎప్పుడు భారత పుడిమిన అడుగులు పెడతారు
భారత భూమికి మోక్షం పడుతుందంటాము
అమ్మ, నాన్న మాటలు తగ్గి
మమ్మీ, డాడి మాటలు పెరిగి
మాట, మాట ఫలుకులకు
ఆంగ్ల పదాలే జోరంటు
ఇదేమి తంటా...
మన తెలుగుభాష పోతుంది మన యింట

...కవితా రచన
మజ్జి శ్యామసుందరరావు

## పంచాంగం

| మాసం : వైశాఖ తిథి : సప్తమి సా. 7.49పుష్యమి<br>మ. 1.13 ఉ.వ 7.07ల 8.39 రా.వ. 1.19 ల 2.50 | శనివారం<br>11-05-2019 |
|---|---|

**మేషం:** వైద్యులకు శస్త్రచికిత్సలలో ఏకాగ్రత మెళకువ చాలా అవసరం. ఉద్యోగస్తులు పైఅధికారుల నుంచి మంచి గుర్తింపు లభిస్తుంది. వస్త్ర వ్యాపారులు పనివారలను ఓ కంట కనిపెట్టుకుని ఉండటం శ్రేయస్కరం. **వృషభం :** మీ చుట్టు ప్రక్కల వారితో మంచి గుర్తింపు, రాణింపు లభిస్తుంది. కోర్టు వ్యవహారాలు వాయిదా పడటం మంచిది. స్త్రీలకు దైవ, పుణ్యకార్యాల పట్ల ఆసక్తి పెరుగు తుంది. సిమెంటు, కలప, ఇటుక వ్యాపారస్తులకు పురోభివృద్ధి కానవస్తుంది. **మిథునం :** ప్రముఖుల ఇంటర్వ్యూ కోసం పడిగాపులు తప్పవు. సోదరి, సోదరులతో ఉల్లాసంగా గడుపు తారు. దైవ దర్శనాల వల్ల మానసిక ప్రశాంతత లభిస్తుంది. ఆత్మస్థైర్యంతో శ్రమించి అనుకున్నది సాధిస్తారు. **కర్కాటకం :** బ్యాంకుల్లో మీ పనులకు స్వల్ప ఆటంకాలు ఎదురవుతాయి. ఇతరులకు వాహనం ఇవ్వటం వల్ల సమస్యలు తలెత్తుతాయి. అకాల భోజనం, విశ్రాంతి లోపం వల్ల ఆరోగ్యం మందగిస్తుంది. స్థిరాస్తి విక్రయానికి ఆటంకాలు తొలగి పోగలవు. చెప్పుడు మాటలకు ప్రాధాన్యమివ్వటం మంచిది కాదని గ్రహించండి. **సింహం :** సంఘంలో మీ మాటకు మంచి గుర్తింపు, రాణింపు లభిస్తుంది. ఉద్యోగ రీత్యా దూర ప్రయాణాలు చేయవలసి వస్తుంది. సినిమా, సంగీత, నృత్య కళాకారులకు సన్మానాలు వంటివి జరుగుతాయి. కుటుంబ సమస్యల నుండి బయటపడతారు. స్త్రీలకు టి.వి కార్యక్రమాలకు సంబంధించిన ఆహ్వానాలు అందుతాయి. **కన్య :** మీ కళత్ర మొండి వైఖరి మీకు ఎంతో చికాకు కలిగిస్తుంది. పాత వస్తువులను కొని సమస్యలు తెచ్చుకోకండి. స్త్రీలకు అయిన వారి ఆరోగ్యం కలవరపరుస్తుంది. ముఖ్యమైన వ్యవహారాల్లో బిజిగా ఉంటారు. బ్యాంకు వ్యవహారాలు మందకొడిగా సాగుతాయి. **తుల :** ఉత్తర ప్రత్యు త్తరాలు సంతృప్తినిస్తాయి. వ్యాపారాల అభివృద్ధికి బాగా శ్రమిస్తారు. స్త్రీలకు సంపా దన పట్ల ఆసక్తితో పాటు అవకాశాలు కలిసిరాగలవు. రుణం తీర్చి తాకట్టు వస్తువులను విడిపిస్తారు. ప్రముఖుల కలయిక వల్ల ఏమంత ప్రయోజనం ఉండదు. సంఘంలో పలుకుబడి కలిగిన వ్యక్తులతో పరిచయాలు పెంచు కుంటారు. **వృశ్చికం :** నిరుద్యోగులు నిరుత్సాహం వీడి ఆత్మ విశ్వా సంతో యత్నాలు కొనసాగించటం మంచిది. పెద్దలను, ప్రముఖులను కలుసుకొని వారికి బహుమతులు అందజేస్తారు. **ధనుస్సు :** ంవ్యాపారాల్లో పోటీని తట్టు కుంటారు. మీ కార్యక్రమాలలో స్వల్ప మార్పులుంటాయి. కాంట్రాక్టర్లకు ఏకాగ్రత లోపం వల్ల చికాకులు తప్పవు. **మకరం :** స్త్రీలకు బంధు, మిత్రులతో మంచి గుర్తింపు రాణింపు లస్తుంది. కొబ్బరి పండ్లు, పూలు, చిరువ్యాపారులకు లాభ దాయకంగా ఉంటుంది. మీ అలవాట్లు బలహీనతలు అదుపులో ఉంచుకోవడం మంచిది. రాజకీయాల లోని వారికి సమస్యలు తలెత్తుతాయి . **కుంభం :** వృత్తి ఉద్యోగాల్లో తలెత్తిన ఆటంకాలు తొలగిపోగలవు. దైవ సేవ, పుణ్యకార్యాల్లో పాల్గొంటారు. ఉపాధ్యాయిలకు సదవకాశాలు లభిస్తాయి. కోర్టు వ్యవహారాలు అనుకున్నంత సాఫీగా సాగవు. **మీనం :** కోర్టు వ్యవహారాల్లో ప్లీడర్లకు చికాకులు తప్పవు. ఖర్చులు, చెల్లింపులు ప్రయోజనకరంగా ఉంటాయి. విదేశీ యానం కోసం చేసే యత్నాల్లో స్వల్ప చికాకులు ఎదుర్కొంటారు.

## సన్మార్గమే నిర్దేశం కావాలి



**నిర్దేశం** అనే పదానికి చూపించు, ఆజ్ఞాపించు, సూచించు అని అర్థాలున్నాయి. నిర్దేశకుడు అంటే ఆజ్ఞాపించువాడు, చూపించువాడని అర్థం. దేనిని చూపాలి? ఏం ఆజ్ఞాపించాలి..? అనేవి ఆయా వ్యక్తుల వ్యక్తిత్వాన్ని నిర్దేశిస్తుంది. గీతలో అర్జును డికి మార్గోపదేశం చేయడంతో పాటు తానే మార్గ నిర్దేశం అయ్యాడు కృష్ణ భగవానుడు. ఈ జగత్తులో ప్రతి మానవుడు తాను జీవించే విధానం లేదా కర్మల ద్వారా సమాజాన్ని ప్రేరేపిస్తుం టాడు. కొందరు రచనల ద్వారా, మరికొందరు కళల ద్వారా, ఇంకొందరు వృత్తిద్వారా మార్గనిర్దేశం చేస్తూనే ఉన్నారు. ప్రకృతిలోని ఇతర జీవరాశులు సైతం తమదైన శైలిలో మార్గనిర్దేశం చేస్తుంటాయి.

సత్యయుగంలో మానవులు షోడష కళలతో సర్వ శ్రేష్టంగా జీవించేలా దేవతలు మార్గనిర్దేశం చేశారు. త్రేతాయుగంలో సైతం మానవులు గౌరవం, సోదరభావంతో మెలుగుతూ సామాజిక విలువలను ఉన్నతపథంలో నిలిపారు. ద్వాపర యుగంలో భక్తిమార్గం సమాజానికి సరైన దిశా నిర్దేశం చేసింది. రుషులు, మునులు, తపోధ నులు.. పరమాత్ముడి గుణగణాలను తెలియజేస్తూ ఎన్నో కావ్యాలను వెలువరించారు. ధర్మగ్రంథాలుగా ప్రాచుర్యం పొందిన ఈ కావ్యాలు నేటికి సామాన్య మానవులకు సైతం మార్గ నిర్దేశం చేస్తున్నాయి.

సాంఘిక జీవనంలో భాగంగా ఉన్న మనం.. ఆ సమాజానికి కీడు తలచడం సరికాదు. ప్రాణికోటి శుభం కోరే పరమాత్ముడి సంతానంగా ఉన్న మనం.. అశుభం కోరడం సమంజసం కాదు. ఎన్ని కష్టాలు ఉన్నా.. మనసా, వాచా, కర్మణా మంచినే కోరాలి. పరమ శివుడు నిర్దేశించిన శ్రీమతం ద్వారా సర్వ సమాజానికి అంతా మంచే జరుగుతుంది. మానవ జీవితంలో ఎదురయ్యే సమస్యలు యుద్ధంలాంటివైతే.. వాటిని ఎలా గెలువగలమో నిర్దేశిస్తూ మరొకరికి మార్గదర్శనం చేయాలి. పలాయనవాదులను చరిత్ర అసమర్థులుగా తేల్చి చెప్పింది. కష్టనష్టాలకోర్చి ముందుకు సాగేవాడే సమర్థుడు. అందుకే స్వామి వివేకానందుడు సమర్థవంతులైన కొందరి జీవితమే చరిత్ర అని వ్యాఖ్యానించారు. బీదవాడుగా జన్మించడం తప్పుకాదు. పేదవాడిగా మరణించడమే తప్పు అంటూ ఓ కవి నిర్దేశించారు. దీన్ని సార్థకం చేసుకున్నవారే సమర్థులు. అలాగని ప్రతి ఒక్కరూ ధనవంతులై పోవాలని కాదు. స్వయంకృషితో ఎదగాలని కవి భావం. ప్రతి వ్యక్తీ తన కుటుంబ పోషణకు సరిపడా ధనం ధర్మమార్గంలో సంపాదించాలి. కాని, అవసరాల కోసం పక్కవాడి పొట్ట కొట్టకూడదు. మాయమాటలు చెప్పి సాయం పొందడం అనైతికం. బీదరికం అనేది జీవిత సామర్థ్యం నిరూపించుకోవడానికి అందిన వరంగా భావించాలి. అందుకు తగ్గట్టుగా ధర్మబద్ధమైన మార్గాన్ని నిర్దేశించుకోవాలి. ఈశ్వరీయ జ్ఞాన యోగాల సంపదను సముపార్జించ కుండా శరీరం వదలడం అంటే మీ జీవనయానం సరైన దిశలో సాగలేదనే అర్థం.

వేదాలు, పురాణాలు, ఇతిహాసాలు ఏది మంచి, ఏది చెడు తెలియజేస్తూ మనుష్యులను ముందుకు నడిపిస్తు న్నాయి. ఆదికాలం నాటి మానవ జీవన విధానం వేదాలలో అక్షర రూపమైందా..? వేదాక్షర రూపాన్ని మానవులు పాత్రగా పోషించి ఇతిహాసం అని అంటున్నారా..? అనేది అసలు ప్రశ్న. అయితే ఈ రెండూ ఒకే చక్రంలో తిరుగుతున్నాయి. ఇందులో ఏది ముందు, ఏది తర్వాత అన్న భేదం లేదు. ఈ రెండూ మనుష్య జాతిని సరైన మార్గంలో నడిపిం చడానికి పరమాత్ముడు సృష్టించిన అద్భుతమైన శక్తులే.

### సంకీర్తన






# అధికమవుతున్న మంచినీటి సమస్య

అనంతగిరి : అనంతగిరి మండలంలో గల పలు గ్రామాలలో మంచి నీటి సమస్య అధికంగా ఉందని సిపిఎం నాయకులు మొసియా సింగులు తదితరులు తెలిపారు, మండలంలో గల తట్ట వలస, గొంద్రంంగి పాడు, నేరేడు వలస, తదితర గ్రామాల్లో మంచి నీటి సమస్య రాజ్యమేలుతుందని అధికారులు స్పందించి, సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

# అక్రమ కట్టడాలు తొలగింపు



చోడవరం : విశాఖ జిల్లా చోడవరం మండలంలోని అంకుపాలెం గ్రామంలో సర్వే నెంబర్ దబ్బయ్ రెండులో గోవెర్నెమెంటు హైస్కూల్ వెనుకభాగంలో పందొమ్మిది వందల ఎనభై నాలుగులో కొంతమంది కి ఇళ్లస్థలాలకు ఎప్రూవల్ ఇవ్వడం జరిగింది. వీళ్ళు ప్రక్కన వున్న హైస్కూల్ స్థలాన్ని స్థలాన్ని కలుపు కొని అక్రమ కట్టడాలు కట్టడం జరిగింది. దీనికి రెవిన్యూ వారు ఫారం సెవెన్ ఫారం ఎక్స్ జారీచేయడం జరిగింది. ఈళ్ళలో పన్నెండు మంది నోటీసులు అందుకున్నారు. మిగతా ఎనిమిది మంది నోటీసులను తిరస్కరించి బేఖాతరు చేశారు. ప్రతిది కూడా పోస్టులో రికార్డు అయ్యిందని దీన్ని రెవిన్యూ వాళ్ళు కోర్టుకు క్లారిఫికేషన్ ఇవ్వడంతో మరియు మూడు వందల ఎనభై ఎనిమిది జీవో ప్రకారం గవర్నమెంటు లెండలో కట్టుకున్నావాళ్ళకు రెగ్యులర్ చెయ్యమని వీలందరు దరఖాస్తు చెయ్యడం జరిగింది దీని బట్టీకోర్టు చోడవరం రెవిన్యూ వారికి జనవరిలో తొగించామని అదేశాలు జారీచేశారు దీనికి రెండువిధాలుగా జారీ చేశారు. ఒకటి మెయిన్ రోడ్ వైపు షాపుల కు స్కూల్ వెనుక వైపు అక్రమ కట్టడాలు తొలగింపుకు ఆర్డిఓకు చోడవరం తహశీల్దార్‌కి ఎలక్షన్స్ కావడంతో అప్పట్లో అవలేదు పదిరోజులనుచి చెపుతున్నప్పటికీ పట్టించుకోకపోవడంతో శుక్రవారం పోలీస్ వారి సహాయంతో తొలగించడం జరిగిందని తహసీల్దార్ బి.రవికుమార్ అన్నారు.

# వృద్ధులకు సేవా కార్యక్రమాలు

రోలుగుంట : రోలుగుంట మండలం జె.నాయుడుపాలెం గ్రామానికి కొవురుబెల్లి మరిడియ్య గారి జ్ఞాపకార్ధంగా తన కుమార్తె కొవురుబెల్లి రామోజి, మనుమడు విజయ్, మనుమరాలు రాణి, సిఆర్ సురేష్ కలిసి శుక్రవారం రోలుగుంట మండలం కొవ్వూరు వృద్ధాశ్రమం, పెదబొడ్డేపల్లి వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు, మజ్జిగ, బిస్కెట్లు, డ్రింక్ బాటిళ్లు అందజేశారు. ఈ సందర్భంగా రామోజి మాట్లాడుతూ తన తండ్రి మరిడియ్య జ్ఞాపకార్ధంగా ఈ సేవా కార్యక్రమం చేయడం చాలా సంతృప్తిగా ఉదన్నారు. తన తండ్రి లేని లోటు బాధగా ఉన్నప్పటికీ తన తండ్రి జ్ఞాపకాలు ఇప్పటికీ తన మదిలో ఉన్నాయన్నారు. ప్రతీ సంవత్సరం ఇలాగే తన తండ్రి జ్ఞాపకార్ధంగా ఇటువంటి సేవా కార్యక్రమాలు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో విజయ్, సిఆర్ రాణి, సురేష్ పాల్గొన్నారు.

# వేసవి దొంగతనాలపై అప్రమత్తంగా ఉండాలి

### నాతవరం ఎస్సై సత్యనారాయణ

నాతవరం : వేసవిలో జరిగే దొంగతనాలపై అప్రమత్తంగా ఉండాలని నాతవరం ఎస్సై వి.సత్యనారాయణ సూచించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ వేసవిలో దొంగతనాలు జరిగే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇల్లు విడిచి ఇతర ప్రాంతాలకు వెళ్లేటప్పుడు బంగారు నగలు ఏమైనా ఉంటే బ్యాంకు లాకర్లలో భద్రపర్చుకోవాలన్నారు. బంగారు వస్తువులకు మెరుగుపెడతామని ఎవరైనా వస్తే వారి మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. ఇప్పటికే గ్రామాల్లో ప్రజలకు సిబ్బంది ప్రచారం నిర్వహించామన్నారు. బ్యాంకుల వద్ద మహిళలు డబ్బులు డ్రా చేసేటప్పుడు జాగ్రత్తగా ఉండాలన్నారు. గ్రామాల్లో రాత్రివేళ అపరిచితులు సంచరిస్తే పోలీసులకు వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు.

# అమ్మవారికి వెండి వస్తువుల బహుకరణ

మాకవరపాలెం : మండలంలోని కామేశ్వరమ్మ అమ్మవారికి కిలో వెండి వస్తువులు బహుకరించారు. నర్సీపట్నంలోని ఓ మెడికల్ దుకాణానికి చెందిన రమేష్, సతీష్ కామేశ్వరమ్మ పండుగను పురస్కరించుకొని కేజీ బరువు గల వెండి పళ్లెం, చెంబు, ఇతర వస్తువులను ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో దాతల కుటుంబీకులు పాల్గొన్నారు.

## ఉపాధి పనుల్లో అవినీతిపై విచారణ జరపాలి

కొయ్యూరు : చీడిపాలెం పంచాయతీ ఉపాధి హామీ పనుల్లో జరిగిన అవినీతిపై అధికారులు తక్షణమే విచారణ జరపాలని పీసా కమిటీ నేత గోకిరి చిన్నారావు, వైసిపి నాయకులు శేషు డిమాండ్ చేశారు. రైతుల పొలాల్లో పనులు చేయకుండానే నిధులు స్వాహా చేశారన్నారు. రూ.50లక్షల వరకు అవినీతి జరిగిందని చెప్పారు. ఈ వ్యవహారంలో ఓ టీడీపీ నాయకుడి హస్తం ఉందని ఆరోపించారు. అధికారులు వారం రోజులుగా విచారణ చేపట్టకుంటే ఎంపిడిఓ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ విషయమై గిరిజన సంక్షేమశాఖ కమిషనర్, జిల్లా కలెక్టర్, ఐటిడిఏ పిఒలకు వినతులు పంపినట్లు వారు తెలిపారు.

# సాలికమల్లవరంలో పని పిలుపు కార్యక్రమం

గొలుగొండ : గ్రామాల్లో జరుగుతున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పని పిలుపు కార్యక్రమం ద్వారా కూలీలను పనుల్లో పాల్గనే విధంగా ఆహ్వానించే కార్య క్రమం చేపడు తున్నామని నర్సీ పట్నం క్లస్టర్ ఎపిడి శ్రీనివాస్ అన్నారు. మండలంలో శుక్ర వారం సాలిక మల్లవరం గ్రామాల్లో కోనేరులో జరుగు తున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జాబ్ కార్డు కలిగిన ప్రతీ ఒక్కరికీ వంద రోజులు పని దినాలు కల్పిం చేందుకు కృషి చేస్తున్నా మన్నారు. నర్సీపట్నం క్లస్టర్‌లో 80శాతం మంది కూలీలు పనుల్లో పాల్గంటున్నారని చెప్పారు. కూలీలతో పాటు మేటు పనుల్లో పాల్గొనా లన్నారు. జాబ్‌కార్డుల్లో నమోదైన పేరు ఉన్న వారు మాత్రమే పనుల్లో పాల్గనాలన్నారు. విద్యార్థులు పనుల్లో పాల్గంటే విఆర్‌పిలపై కఠిన చర్యలు చేపడతామన్నారు. కూలీలకు తాగునీరు టార్పిన్లు వంటి సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గొలుగొండ ఉపాధి హామీ ఎపిఓ సుప్రియ పాల్గొన్నారు.



సాలికమల్లవరంలో ఉపాధి పనులు పరిశీలిస్తున్న క్లస్టర్ ఎపిడి శ్రీనివాస్

# 10వ వార్డులో పారిశుధ్య పనులు పరిశీలన



పారిశుద్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్ రవిబాబు

నర్సీపట్నం : నర్సీపట్నం మున్సిపాలిటీలోని 10వ వార్డులో మున్సిపల్ కమిషనర్ పి.రవిబాబు శుక్రవారం పర్యటించారు. కాలువలను దగ్గ రుండి శుభ్రం చేయిం చారు. వీధి దీపాలను సరి చేయిం చారు. కొళాయిలను పరిశీ లించారు. అనంతరం వార్డు ప్రజలతో మాట్లాడి సమస్య లను తెలుసు కున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రతీ రోజు వార్డులను సందర్శిస్తా మన్నారు. అక్కడ సమస్య లను పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్య క్రమంలో మున్సిపల్ సిబ్బంది, పారిశుద్య కార్మికులు పాల్గొన్నారు.

## పోలీసు స్టేషన్ నందు దళితులపై దౌర్జన్యము చేసిన వారిపై ఫిర్యాదు

అన్నవరం : తూ.గో.జిల్లా రౌతులపూడి మండలం ఎస్.అగ్రహారానికి చెందిన ఇద్దరు దళిత యువకులను గురువారం దారి మధ్యలో అడ్డగించి దౌర్జన్యము చేసి,వారిని కులం పేరుతో దూషించిన కందివలస.సుబ్రహ్మణ్యం,తలపంటి.చిన్నబ్బాయి తదితరులపై ఎస్సీ,ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం క్రింద కేసు నమోదు చేసి తక్షణము భాద్యులపై చర్యలు తీసుకోని,అరెస్టు చేయాలని దళిత నాయకులు డిమాండ్ చేసారు.అయితే గ్రామంలోని దళితులపె యాదవులు,ఇతర వర్ణముల వారు కర్రలతో,కత్తులతో గస్తీ చేసి తిరుగుతున్నారని అలాంటి వారిపై తక్షణము అరెస్టు చేయాలని అన్నవరం పోలీసు స్టేషన్ నందు ఫిర్యాదు చేసారు.అలాగే దళితులకు తగిన రక్షణ కల్పించి, బాధితులకు ఉపసమనం కొరకు ఉపాది కల్పించి,దాడి చేసిన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో బాదితులతో పాటు గ్రామ ఎస్సీలు, దళిత నాయకులు రాజాల చిట్టిబాబు, సరమర్ల మధుబాబు, రాయి శ్రీను, కొల్లాబత్తుల దిలీప్, తంటి.కిరణ్ కుమార్, జెసి.బాబు, బోడపాటి కాంతం, రమణ, జ్యోతిబాబు తదితరులు పాల్గొన్నారు.



# వర్షాలు కురవక చెరకు రైతు నిరాశ



రోలుగుంట : ఎండలు మండిపోతున్నాయి. ఈదురుగాలులు మినహా వర్షాలు కురవడం లేదు. మండల రైతాంగం వర్షాభావ పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. సరైన వర్షాలు కురవక రైతుల్లో నిరాశ వ్యక్తం చేస్తున్నారు. పంటల సాగుకు పంట భూముల్లో తడులు లేక రైతులు ఆందోళన చెందుతున్నారు. చెరకు నాట్లకు అదును దాటిపోతుంది. ప్రతీ ఏడాది ఈ సమయానికి 65శాతం పైబడి చెరకు నాట్లు జరిగేవి. మండలంలో వరి తర్వాత చెరకే ప్రధాన పంట కావడం, గోవాడ సుగర్స్ ఫ్యాక్టరీలో సభ్యులు కావడంతో చెరకు నాట్లు వేయడం తప్పనిసరిగా మారింది. దీంతో ప్రత్యామ్నాయ పరిస్థితుల వైపు దృష్టిసారించారు. పెట్టు బడులు సైతం లెక్కించకుండా రైతులు నీటి తడులతో నాట్లు వేయడం ప్రారంభించారు. అడుగంటిన బావుల నుంచి అరకొర వచ్చే నీటిని అద్దెకు తెచ్చుకున్న మోటర్లతో తోడి పొలాలకు అందిస్తున్నారు. దుక్కు చేసుకున్న భూముల్లో కాలువలు ఏర్పాటు చేసి కూలీలతో బిందెలతో నీటితడులు వేసి నాట్లు వేస్తున్నారు. మండలంలో రెండు రోజులుగా శరభవరం, వడ్డిప, కొండపాలెం, వెలంకాయ పాలెం గ్రామాల్లో సుమారు 1200 ఎకరాల్లో విధానంలో నాట్లు జరిగాయి. వర్షాలు కురవకపోవడం ఒక సమస్య కాగా, వ్యవసాయ బోర్లు అడుగంటడటం, విద్యుత్ సరఫరా పూర్తి స్థాయిలో లేక మోటార్లు పని చేయక వల్ల ఈ విధమైన సమస్యలు తప్పలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు అతివృష్టి, అనావృష్టిగా మారడంతో వేలాది రూపాయల పెట్టుబడులు పెట్టాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. నాట్లు వేశాం, వరుణుడు కరుణించాలని రైతులు కోరుతున్నారు.

# మున్సిపాలిటీ ఓటర్ల జాబితా ప్రదర్శన

నర్సీపట్నం : ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నర్సీపట్నం మున్సిపాలిటీ ఓటర్ల జాబితాను మున్సిపల్ కమిషనర్ పి.రవిబాబు శుక్రవారం ప్రదర్శించారు. మున్సిపాలిటీలోని 27 వార్డులకు సంబంధించి ఓటర్ల జాబితాను సిద్ధం చేశారు.

వీటిని మున్సిపల్ కార్యాలయం, తహశీల్దార్ కార్యాలయం, ఆర్డీవో కార్యాలయంలో వీటిని ప్రదర్శించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ పి.రవిబాబు మాట్లాడుతూ నర్సీపట్నం మున్సిపాలిటీ 27 వార్డుల్లో మొత్తం 48055 మంది ఓటర్లు ఉన్నారన్నారు. అందులో 23071 పురుషులు, 24988 మంది మహిళలు ఓటర్లు ఉన్నారన్నారు. ఇతరులు ఆరుగురు ఉన్నారు. మొత్తం 48055 ఓటర్లు ఉన్నా రన్నారు. అదే విధంగా రాజకీయ పార్టీల నాయకులకు కూడా వీటిని అందజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



ఓటర్ల జాబితాను ప్రదర్శిస్తున్న మున్సిపల్ కమిషనర్

# పార్కింగ్ స్థలం లేక ఇబ్బందులు

యలమంచిలి రూరల్ : పట్టణంలో రోడ్లను విశాలం చేసినా పార్కింగ్ స్థలం లేకపోవడం, ఆక్రమణలు పెరిగిపోవడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. మెయిన్‌రోడ్డు వెంబడి వ్యాపారులు తమ పరిధి దాటి రోడ్డును ఆక్రమించడంతో రాకపోకలు సాగించేందుకు వీలులేని పరిస్థితి. పోలీసులు పలుమార్లు ఆక్రమణలు తొలగించే సమయంలో రాజకీయ ఒత్తిడి వల్ల సమస్య పరిష్కరించలేకపోతున్నారని పలువురు విమర్శిస్తున్నారు. గత కాంగ్రెస్ హయాంలో అప్పటి ఎమ్మెల్యే కన్నబాబు రోడ్లన్నీ విస్తరించి వాహనాలు నిలుపుకునేందుకు వివిధ కూడళ్లలో స్థలాన్ని కేటాయించారు. అతర్వాత కాలంలో క్రమేపి దిమిలి రోడ్డు కూడలి, బస్టాండు కూడలి ఆసుపత్రి ప్రాంతాల్లో మెయిన్ రోడ్డులో పలు ఆక్రమణలు వెలిశాయి.

కొంత మంది దుకాణదారులు పూర్తిగా ఆక్రమించుకోవడంతో రోడ్డు ఇరుకుగా మారాయి. దీంతో వాహనాలు నిలుపుకునేందుకు స్థలం లేక వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. మెయిన్‌రోడ్డు వెంబడి మార్జిన్ ఏర్పాటు చేస్తే వాహనాలు నిలుపుకునేందుకు అవకాశం ఉంటుం దని వాహన చోదకులు పేర్కొంటున్నారు.

# 14న గొలుగొండ మండల సమావేశం

గొలుగొండ : మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 14న జరగనుందని ఇన్‌చార్జ్ ఎంపిడిఓ రవికుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 14న ఉదయం 11 గంటలకు జరిగే ఈ సమావేశానికి పలు అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు. ఎంపిటిసి సభ్యులతో పాటు ఆయా విభాగాల అధికారులు విధిగా హాజరు కావాల్సిందిగా కోరారు.

# కూలీల సమయపాలన పాటించకుంటే గిట్టుబాటు కాదు

మాకవరపాలెం : ఉపాధి కూలీలు సమయపాలన పాటించకపోతే వేతనం గిట్టుబాటు కాదని ఏపిఓ యరకయ్య అన్నారు. మాకవరపాలెం, తామరం, కొండలఅగ్రహారం గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 25 పంచాయతీల్లో తొమ్మిది వేల మంది ఉపాధి కూలీలు పనులకు హాజరవుతున్నట్టు చెప్పారు. కొంత మంది కూలీలకు నిబంధనల ప్రకారం రూ.205 రావాల్సి ఉండగా, రూ.140 నుంచి రూ.160 వస్తుందన్నారు. రెండు పూటలా పని చేస్తే వేతనం గిట్టుబాటు అవుతుందని వివరించారు. ఉదయం ఏడు నుంచి పదిన్నర గంటల వరకు, సాయంత్రం మూడు నుంచి ఆరు గంటల వరకు విధిగా పని చేయాలన్నారు. పని ప్రదేశంలో తాగునీరు, టెంట్లు విధిగా ఉండాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు ఆయన ఆదేశించారు.

## గ్రామం పేరు తప్పుపడటంతో ఇబ్బందులు



కొత్తకోటకు బదులు
కొత్తపేట పేరుతో ఏర్పాటు చేసిన బోర్డు

మాకవరపాలెం : గ్రామం పేరు తెలిపే ఓ బోర్డుతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. పైడిపాల సెంటర్ నుంచి బూరుగుపాలెం మీదుగా రోలుగుంట మండలం కొత్తకోట గ్రామంలోని వెళ్తున్న రోడ్డులో కొత్తకోట గ్రామానికి బదులు కొత్తపేట అనే పేరుతో బోర్డు ఏర్పాటు చేశారు. దీంతో ఈ గ్రామం ఎక్కడ ఉందా అని ప్రయాణికులు ఆలోచనలో పడుతున్నారు. గత్యంతరం లేక కొత్తకోట వెళ్లే కొత్తవారు దారి పొడవునా సమాచారం తెలుసుకుంటూ గ్రామానికి చేరుకోవాల్సి వస్తోంది. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బి అధికారులు స్పందించి బోర్డుపై ఉన్న పేరును సరి చేయాలని కోరుతున్నారు.

## సాగునీటి చెరువుల ఆక్రమణలపై ఫిర్యాదు

నాతవరం : సాగునీటి చెరువుల ఆక్రమణలపై కొంత మంది రైతులు నాతవరం తహశీల్దార్ లక్ష్మణప్రసాద్, తాండవ జలాశయ డిఇఇ రాజేంద్రకుమార్‌కు ఫిర్యాదు చేశారు. సాగుకు జీవనాడిగా ఉన్న చెరువులనే పంట పొలాలుగా మార్చేస్తున్నారు. కేవలం చెరువు కింద సాగు రైతులే యధేచ్ఛగా ఆక్రమణలను ప్రోత్సహిస్తుంటే తోటి రైతులు అధికారులకు ఫిర్యాదు చేసి చెరువులను కాపాడాలని వేడుకుంటున్నారు. నాతవరం మండలం చెర్లోపాలెం గ్రామంలో తాండవ జలాశయానికి చెందిన మూడు చెరువులు, ఆక్రమణలకు గురయ్యాయి. తమ పొలాలకు నీరిచ్చే చెరువులను కాపాడుకోవాల్సిన వారే వీటిని కాజేయాలని చేస్తున్న ప్రయత్నం వెలుగులోకి వచ్చింది. ఇక్కడ నీలాపవాని చెరువు, రావాడవాని చెరువు, సీతాడబంద చెరువు గర్భంలోని భాగంతో పాటు ప్రధాన గట్టును కోరి వేసి సుమారు రెండెకరాలను పంట పొలాలుగా సరిహద్దు రైతులు కనిపిస్తున్నారు. పొక్లెయిన్‌ను ఉపయోగించి మరీ గట్టను తొలగించడం మొదలుపెట్టారు. దీనిపై ఆగ్రహించిన రైతులు అధికారులకు ఫిర్యాదు చేశారు. వెంటనే అధికారులు చర్యలకు సిద్ధమయ్యారు.

# స్త్రీనిధి నుంచి రూ.1.30కోట్ల రుణాలు

రోలుగుంట : స్త్రీనిధి నుంచి ఈ ఏడాది మండలానికి రూ.1.30 కోట్లు కేటాయించినట్టు వెలుగు ఉద్యోగి వాసు, డిజిఎం కనకమహాలక్ష్మి తెలిపారు. మండల స్థాయి మహిళా సమాఖ్య సమావేశాన్ని నిర్వహించారు. ఇక్కడ గ్రామాల వారీగా స్త్రీనిధి, బ్యాంకు లింకేజి రుణాలు, జమలపై చర్చించారు. మొండి బకాయిలను గుర్తించి ఆ సంఘాల నుంచి రుణాలు రికవరీ, సంఘాల అభివృద్ధి, కొత్త రుణాలు మంజూరులో పాటించాల్సిన నిబంధనలను చర్చించారు. గత ఏడాదికి సంబంధించి రికార్డులు ఆడిట్‌కు సిద్ధం చేయాలన్నారు. జీడి మొక్కలు వేసిన ప్రతీ రైతుకు పేమెంట్ చేసి మొక్కలను సంరక్షించాలని సూచించారు. సమావేశం సామాజిక కార్యకర్తలు సంతోష్, రమణ పాల్గొన్నారు.

## త్వరలో గొల్లలపాలెం రోడ్డు ప్రారంభం

రావికమతం : మండలంలోని మరుపాక శివారు గొల్లలపాలెం గ్రామానికి ఎట్టకేలకు రహదారి సమస్య తీరింది. మండల కేంద్రానికి కూత వేటు దూరంలో ఉన్న ఈ గ్రామానికి రహదారి సౌకర్యం లేక ప్రజలు రాకపోకలకు ఇబ్బందులకు గురయ్యేవారు. సమస్యను ఎంపిటిసి సభ్యుడు జెర్రిపోతుల రాంబాబు, ఎంపిపి దంగేటి రామకృష్ణ, టీడీపీ మండల అధ్యక్షుడు రాజాన కొండ నాయుడు సహకారంతో గ్రామస్థులు ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్.రాజు దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన గర్నికం థియేటర్ బిఎన్ రోడ్డు నుంచి గొల్లలపాలెం మీదుగా మేడివాడ వరకూ రింగ్ రోడ్డు నిర్మాణానికి రూ.99లక్షలు మంజూరు చేయించారు. నిర్మాణం పూర్తి కావడంతో త్వరలో రోడ్డును ప్రారంభించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

# ప్రశాంతంగా ప్రవేశ ప్రరీక్ష

- ఏపీఆర్‌జేసీకి 658 మంది గైర్హాజరు
- ఏపీఆర్‌డీసీకి 160 మంది గైర్హాజరు

శ్రీకాకుళం : ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయ సంస్థలో జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. జిల్లా కేంద్రంలోని 37 పరీక్ష కేంద్రాల్లో ఈ పరీక్షలను నిర్వహించారు. జిల్లా కలెక్టర్ జె.నివాస్, డీఆర్వో కె.నరేంద్రప్రసాద్, డీఈవో ఎం.సాయిరాం, డిసీవో ఎం.మోహనరావులు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. ఏపీ ఆర్‌జేసీకి 7,639 మంది దరఖాస్తు చేసుకోగా 6,981 మంది హాజరైయ్యారు. 658 మంది విద్యార్థులు గైర్హాజ రయ్యారు. ఏపీఆర్‌డీసీకి 1,094 మందికిగాను 934 మంది హాజరైయ్యారు. 160 మంది గైర్హాజరయ్యారు.

# పెన్షనర్స్ సభ్యులకు ఘన సన్మానం



అన్నవరం : తూ.గో.జిల్లా అన్నవరం శ్రీ సత్యదేవ ఫెన్షనర్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం శుక్రవారం జరిగింది.ఈ సమావేశంలో 70 నుండి 75 సంవత్సరములు సర్వీసు నిండిన ఫెన్షనర్లు లింగంపల్లి. చక్రం, చిట్రా ధర్మారావు, చిలకమర్తి నూకరాజు, ఆర్.దేముళ్ళమ్మ, బి.గంగమ్మ, ధారా అప్పలకొండ, నంబారు వ్యాపారమ్మలను సత్యదేవ ఫెన్షనర్స్ అసోసియేషన్ గౌ.అధ్యక్షుడు పోల్నాటి గోవిందరావు, అధ్యక్షుడు ఈర్లు వరహాలు, ఉపాధ్యక్షుడు రామ చంద్రరావు, ట్రైజరర్ వెంకటరమణమూర్తి దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు.

# ఘనంగా వనదుర్గమ్మ ఆలయంలో చండీ హోమం



అన్నవరం : తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో వనదేవతగా పూజలు అందుకొంటున్న వనదుర్గమ్మవారి గుడిలో శుక్రవారం ఘనంగా చండీ హెూమం నిర్వహించారు. ఉదయం 9గం.లకు విఘ్నేశ్వరుని పూజా,పుణ్యవచనం అమ్మవారికి మూల,మంత్ర జపములు చండీ సప్తపతి పారాయణములు నిర్వహించారు.అనంతరం 11గం.లకు పూర్ణహుతి గావించారు.పూజా కార్యక్రమాలను ఆలయ ప్రధాన అర్చకులు కొండవీటి.సత్యనారాయణ ఆద్వర్యంలో చల్లపల్లి.ప్రసాద్ శర్మ,కొంపెల్ల. మూర్తి,కుచిబోట్ల.ప్రసాద్ మరియు వేదపండితులు, అర్చకులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏసి. ఈరంకి.జగన్నాధరావు, ఆలయ సిబ్బంది,గ్రామ ప్రజలు,భక్తులు పాల్గొన్నారు. వేదపండితుల వేదాశీస్సులు అనంతరం భక్తులకు తీర్ధ,ప్రసాదాలు అందజేసారు.

# ఓటరు నమోదు కార్యక్రమం

పెదగంట్యాడ : ఈనెల 12వ తేదీనుంచి గాజువాక ప్రజల సౌక్యర్యార్ధం వైకాపా ఆద్వర్యంలో ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వైకాపా నాయకులు దొడ్డిరమణ ఓ ప్రకటనద్వారా తెలిపారు. బిసిరోడ్డు ఎన్టిఆర్ కూడలి వద్ద ఆదివారం ఉదయం 8గం నుంచి ప్రారంభమైయ్యే ఈ కార్యక్రమాన్ని ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 18సం. నిండిన యువతీ, యువకులు పురప్రజలు ఓటరు నమోదు కోసం ఆదార్, గ్యాస్, రేషన్, కరెంట్ జెరాక్స్ కాపీతో పాటు ఒక పాస్‌పోర్టుసైజ్‌గల ఫోటోను అప్లికేషన్‌కు జతచేసి ధరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ఈ కార్యక్రమం పూర్తిగా ఉచితంగా చేయబడునని తెలిపారు. స్థానికులు ఈ కార్య క్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అంతేకాకుండా పాత ఓటరు కార్డులను సరిచేసుకునేందుకు కూడా అవకాశం ఉందని తెలిపారు.

## వడ్లపూడి రైల్వే కాలనీ గ్రౌండ్‌లో

# వాలీబాల్ సమ్మర్ క్యాంపు



గాజువాక: నియోజకవర్గంలోని వడ్లపూడి రైల్వే కాలనీగ్రౌండ్‌లో వాలీబాల్ సమ్మర్ క్యాంపును జాతీయ వాలీబాల్ క్రీడాకారులు వాలీబాల్ శ్రీను, దుర్గాప్రసాద్‌లు ప్రారంభించారు. శుక్రవారం నిర్వహించిన ఈ కార్య క్రమానికి ముఖ్యఅతిథులుగా వారు పాల్గొని మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడల పట్ల యువత మక్కువ చూపాలని, క్రీడలలో రాణించి దేశానికి పేరు తేవాలని సూచించారు. చిన్నారులకు ఈ కార్యక్రమం ద్వారా వాలీ బాల్‌లో ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మోహన్‌రావు,ఎస్‌కోట శ్రీను, బుల్లి, మహేష్, అప్పారావు, వంశీ పాల్గొన్నారు.

# మల్కాపురం మార్కెట్‌లో ప్రమాదకరంగా గోతులు

## - ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు



సింథియా: పారిశ్రామిక ప్రాంతం జీవీయంసీ 49వ వార్డు మల్కాపురం మార్కెట్ కూడలిలో కల్వర్టలు శిధిలావస్థకు చేరుకొని ప్రమాదకరంగా తాయారైయ్యాయి. పెద్ద పెద్దగోతులు ఏర్పడడంతో గోతులో పడి ప్రమాదానికి గురైఅవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రద్దీ ప్రాంతం కావడం, మార్కెట్ పనులకోసం అనేక మంది రావడం, పనులలో బిజిగా ఉండడంతో గోతులను గుర్తించపోతున్నామని, దీంతో గోతులో పడేఅవకాశం ఉందని స్థానికులు ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. దీనిపై సంబంధిత జీవీయంసీ అధికారులకు ఫిర్యాదు చేసిన కనీసం పట్టించుకోవడం లేదని వాపోయారు. ప్రమాదం జరిగితే పూర్తి బాధ్యత జీవీయంసీ అధికారులదేనని హెచ్చరించారు.

ఇప్పటికైన అధికారులు గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# ప్రజలు వడదెబ్బ, ఆరోగ్య సమస్యలకు గురి కాకుండా జాగ్రత్తలు పాటించాలి

## జిల్లా కలెక్టర్ కార్తి కేయ మిశ్రా

కాకినాడ : జిల్లాలో రానున్న రెండు రోజుల్లో వేసవి ఉష్ణోగ్రతలు 43 నుండి 45 డిగ్రీలు నమోదు కావచ్చునని వెలువడిన వాతావరణ హెచ్చరిక దృష్ట్యా ప్రజలు వడదెబ్బ, ఆరోగ్య సమస్యలకు గురి కాకుండా జాగ్రత్తలు పాటించాలని జిల్లా కలెక్టర్ కార్తి కేయ మిశ్రా విజ్ఞప్తి చేశారు.

ఈ మేరకు ఆయన ఆత్యవసర ప్రకటన జారీ చేస్తూ ఇస్రో, యూరోపియన్ వెదర్ ఫోర్ కాస్ట్ సంస్థలు తెలిపిన వాతావరణ సూచనల ప్రకారం ఈ నెల 10 నుండి 12వ తేదీ వరకూ ఉభయ గోదావరి జిల్లాలో 43 నుండి 45 డిగ్రీల వరకూ ఉష్ణోగ్రతలు నమోదైయ్యే అవకాశం ఉందని తెలిపారు. ఈ కారణంగా ఎదురైయ్యే ఎండ తీవ్రత, వడ గాడ్పుల వల్ల ఆరోగ్య సమస్యలు, వడ దెబ్బ సోకకుండా జిల్లా ప్రజలందరూ తగు జాగ్రత్తలు తప్పక పాటించాలని ఆయన కోరారు. ప్రజలు ఉదయం 11 గం.ల నుండి సాయంత్రం 4 గం.ల మధ్య ఆరుబయట ఎండలో సంచరించ వద్దని, తప్పనిసరైతే ఎండ ముదిరేలోపు పనులు పూర్తి చేసుకోవాలని సూచించారు. ఎండలో వెళ్లేపుడు గొడుగు, టోపీ, తలపాగా వంటి ఆచ్ఛాదన ఉపయోగించాలని, నలుపు రంగులో మందంగా ఉండే బట్టలకు బదులు లేత రంగుల్లో, తేలికైన నూలు వస్త్రాలను ధరించాలని కోరారు. మద్యం సేవించరాదని, ఆహారంలో మాంసాహారాన్ని తగ్గించి, తేలికగా అరిగే కూరగాయలను భుజించాలన్నారు. అలాగే ఆహారాన్ని తక్కవ మోతాదులో ఎక్కవ సార్లు తీసుకోవాలన్నారు. తరచుగా పరిశుభ్రమైన నీరు, పళ్లరసాలు, కొబ్బరి నీళ్లు, మజ్జిగ వంటి ద్రవపదార్థాలను ఎక్కువగా తీసుకోవాలని సూచించారు.

ఎవరైన వడదెబ్బకు గురైతే సత్వరం చల్లని నీడ, గాలి తగిలే ప్రదేశానికి చేర్చి, తడిగుడ్డతో శరీరాన్ని తుడవాలని, ఉప్పు కలిపిన మజ్జిగ లేదా గ్లూకోజు ద్రావణం, లేదా ఓఆర్ ఎస్ ద్రావణం త్రాగించాలని సూచించారు. వడదెబ్బ తగిలి అపస్మారక స్థితిలో ఉన్న రోగికి నీరు త్రాగించ వద్దని చికిత్సకొరకు వీలైనంత త్వరగా దగ్గరలోని ఆసుపత్రికి తరలించాలన్నారు. పిల్లలు, గర్భిణులు, బాలింతలు, వృద్ధుల ఆరోగ్యం పట్ల మరింత శ్రద్ధ వహించాలని సూచించారు.

వడ దెబ్బకు లోను కాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై కరపత్రాలను జిల్లావ్యాప్తంగా పంపిణీ చేస్తామని, ఈ జాగ్రత్తలను ప్రజలు తప్పక పాటించాలని జిల్లా కలెక్టర్ కోరారు. జిల్లాలోని అన్ని గ్రామాల్లో ఇప్పటి వరకూ 3,309 చలివేంద్రాలను ఏర్పాటు చేసి చల్లని త్రాగునీరు, మజ్జిగ పంపిణీ ఏర్పాటు చేస్తామన్నారు. స్థానిక సంస్థల ద్వారా 1424, ఎన్జిఓల ద్వారా 462, రెవెన్యూ శాఖ ద్వారా 219, డిఆర్డీఏ ద్వారా 191, ఆరోగ్య శాఖ ద్వారా 1013 చలివేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అన్ని పీహెచ్ సిలు, సి హెచ్ సిలలో అత్యవసర మందులు, సిబ్బందిని సిద్ధంగా ఉంచామని, ఆసుపత్రులు, అంగన్ వాడీ, ఆశా కార్యకర్తలు, పంచాయితీ సిబ్బంది ద్వారా ఇప్పటి వరకూ సుమారు 6 లక్షల ఓఆర్ ఎస్ ప్యాకెట్లు ప్రజలకు పంపిణీ చేయడం జరిగిందన్నారు. పంచాయతీ ప్రత్యేక అధికారులు ప్రతి సోమ, బుధ, శుక్ర వారాలలో తమతమ పంచాయితీలలో పర్యటించి ప్రజల ఆరోగ్యం, పారిశుధ్యం, త్రాగునీరు, ఉపాధి హామీ, చలివేంద్రాల నిర్వహణ తదితర అంశాలపై అవసరమైన తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించామన్నారు. అంగన్ వాడీ కేంద్రాల వేళలను ఉదయ 9 నుండి సాయంత్రం 4 గం.లకు బదులు ఉదయం 8 గం.ల నుండి 11 గం.ల వరకూ పాటించాలని సూచించామన్నారు. అలాగే ఉపాధి హామీ పనులను కూడా 11 గం.ల లోవు ముగించాలని, పనులు జరిగే ప్రదేశాలలో త్రాగునీరు, మజ్జిగ పంపిణీ, షెల్టర్ల ఏర్పాటు చేయాలని ఆదేశించామన్నారు.

జిల్లాలో ప్రస్తుత వేసవిలో ఇప్పటి వరకూ వడ దెబ్బ కారణంగా మూడు మరణాలు నమోదైయ్యాయన్నారు. వడగాల్పుల కారణంగా మరణించి వ్యక్తుల కుటుంబాలకు జిఓ 75 ప్రకారం తహశీల్దారు, వైద్యాధికారి, సబ్ ఇన్స్ పెక్టర్లతో కూడిన త్రిసభ్య కమిటీ సిఫార్సు మేరకు లక్ష రూపాయల ఆర్థిక సహాయం మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ఇందుకు వయోపరిమితి ఏమీ లేదన్నారు. దురదృష్టవశాత్తు ఎవరైనా వడగాల్పుల వల్ల మరణిస్తే ముందు ఆరోగ్య శాఖ మెడికల్ అధికారికి తెలియజేయాలని, శవపరీక్ష, త్రిసభ్య కమిటీ ధృవీకరణ అనంతరం అంత్యక్రియలు నిర్వహించాలని తెలిపారు.

జిల్లాలో వేసవి ఉష్ణోగ్రతలు తగ్గే వరకూ ప్రజలు ఆరోగ్య జాగ్రత్తలను తప్పని సరిగా పాటించాలని జిల్లా కలెక్టర్ కోరారు.

# రిటైర్డ్ ఉద్యోగులకు బకాయిలు వెంటనే చెల్లించాలి

ములగాడ: హిందుస్థాన్ షిప్ యార్డ్ రిటైర్డ్ ఉద్యోగులకు బకాయిలు చెల్లించవలసి ఉందని బకాయిలు వెంటనే చెల్లించాలని సుప్రీం కోర్టు ఆమోదించిన తీర్పు ఈ విషయంపై జీవీఎంసీ 48వ పరిధిలోగల వెంకన్నపాలెం సి ఐ టి యు కార్యాలయంలో శుక్రవారం సమావేశాన్ని ఏర్పాటు చేశారు ఈ సమావేశంలో అధ్యక్షులు హుసేన్ మాట్లాడుతూ ఈ నెల 2 తేదీన రావలసిన తీర్పు వాయిదా పడిందని అన్నారు అలాగే జులై మొదటి వారంలో గానీ రెండో వారంలో గానీ సుప్రీంకోర్టు తీర్పు ఈపీఎఫ్ 95 మంది పెన్షన్ కి అనుకూలంగా వస్తుందని ఆశాభావాన్ని వ్యక్తపరిచారు ఈసమావేశం నందు రెండు తీర్మానాలను ఆయన వివరించారు 1. హిందుస్థాన్ షిప్ యార్డ్ రిటైర్డ్ ఉద్యోగులకు షిప్ యార్డ్ యాజమాన్యం లక్ష రూపాయల బకాయిలు చెల్లించాల్సి ఉందని 2. హైకోర్టు అనుసారం జింక్ కార్మికులకు రావలసిన రెండు సంవత్సరాల వేతన బకాయిలను వెంటనే చెల్లించాల్సిన తీర్మానాన్ని సభ ఏకగ్రీవంగా ఆమోదించింది ఈ సమావేశంలో కార్యదర్శి నూకరాజు ఎం ఆర్ మోహన్ రావు ఎం సూర్య రావు అధిక శాతంలో రిటైర్డ్ ఉద్యోగులు పాల్గొన్నారు

# లక్ష్య సాధనకే విద్యార్థుల పెద్దపీట



బెంగళూరు : విద్యాభ్యాసంతో పాటు ఎంచుకున్న రంగంలో ముందంజ వేసేందుకు విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకోవాలని జైన్ విశ్వవిద్యాలయ సంచాలకుడు డాక్టర్ హరిప్రసాద్ పిలుపునిచ్చారు. కుంబళగోడు డాన్ బాస్కో సాంకేతిక ఇంజినీరింగ్ కళాశాలలో ఉత్తమ ప్రతిభ సాధించిన విద్యార్థులకు ఆయన గురువారం బంగారు పతకాలు, ప్రశంస పత్రాలను అందించి మాట్లాడారు. విద్యాభ్యాసం పూర్తయిన తరువాత తాము ఎంచుకున్న రంగంలో ఎదిగేందుకు ఆత్మవిశ్వాసంతో శ్రద్ధ చూపించాలని సూచించారు. సమయం వృథా చేస్తే తిరిగి రాదన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని హితవు పలికారు. చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని ఆయన సూచించారు. వీటీయూ నిర్వహించిన పరీక్షల్లో అయిదో ర్యాంకు సాధించిన ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విద్యార్థి హేమంత్ కుమార్‌ను కళాశాల యాజమాన్యం సత్కరించింది. చివరి సెమిస్టర్‌లో మంచి మార్కులు సాధించిన 40 మంది విద్యార్థులకు బంగారు పతకాలు, 2, 3వ సెమిస్టర్లలో మంచి మార్కులు సాధించిన 382 మంది విద్యార్థులకు వెండి పతకాలను అందించారు.

# విద్యార్థుల ఆలోచనలకు పేటెంట్ హక్కులు అవసరం



విజయనగరం : విద్యార్థుల నూతన ఆలోచనలు, ఆవిష్కరణలకు పేటెంట్ హక్కులు ఎంతో అవసరమని నోవెల్ పేటెంట్ సర్వీసెస్ యాజమాన్య సంచాలకులు ఎ.హిమబిందు, పి.మురళీ క ృష్ణ అన్నారు. గురువారం సీతం ఇంజినీరింగ్ కళాశాలలో 'ఐపీఆర్ అండ్ పెటెంట్స్' అంశంపై నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. అత్యున్నత ఉత్పత్తుల తయారీలో ఆకృతుల పరంగా పేటెంట్ అవసరమన్నారు. కాపీరైట్స్ ఆవశ్య కతను పరిశోధనాపరంగా ఎలా వాడుకోవచ్చనే అంశం వివరించారు. సదస్సులో భాగంగా కళాశాల నోవెల్ సంస్థ మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. కార్యక్రమంలో కళాశాల సంచాకులు ఎం.శశి భూషణరావు, ప్రధానా చార్యులు డి.వి.రామ్మూర్తి, అధ్యాపకులు పాల్గొన్నారు.

# పాలీసెట్-2019లో 84.98 శాతం అర్హత

ఎచ్చెర్ల : పాలిటెక్నిక్ కోర్సుల్లో చేరేందుకు ప్రభుత్వం నిర్వహించిన పాలీసెట్-2109 ప్రవేశపరీక్ష ఫలితాలను విడుదల చేశారు. జిల్లాలో మొత్తం 28 కేంద్రాల్లో మొత్తం 8025 మంది పరీక్షకు హాజరుకాగా వీరిలో బాలురు 4567 మంది, బాలికలు 2253 మంది ఉత్తీర్ణులయ్యారు. జిల్లా నుంచి 84.98శాతం మంది విద్యార్థులు అర్హత సాధించినట్లు అధికారులు తెలిపారు.

**పాలీసెట్‌లో సత్తా చాటిన తేజేశ్వరరావు**

నరసన్నపేట : పాలీసెట్ ప్రవేశపరీక్షలో రాష్ట్ర స్థాయిలో ముద్దాడ తేజేశ్వరరావు 66వ ర్యాంకు సాధించారు. చిన్నబమ్మిడి గ్రామానికి చెందిన తేజేశ్వరరావు స్థానిక శ్రీజ్ఞానజ్యోతి పాఠశాలలో 1నుంచి 10వ తరగతి వరకు చదువుకున్నారు. తల్లిదండ్రులు పోలయ్య, కృష్ణమ్మలు వ్యవసాయ కూలీలు. తేజేశ్వరరావు ప్రతిభ పట్ల శ్రీజ్ఞానజ్యోతి పాఠశాల ప్రిన్సిపల్, కరస్పాండెంట్‌లు వెలమల భాస్కరరావు, బి.రామారావులు అభినందించారు.

**జ్యోతి స్వరూప్‌కు 78వ ర్యాంకు**

టెక్కలి : టెక్కలి మండలం చింతలగార గ్రామానికి చెందిన కానూరి జ్యోతి స్వరూప్ విడుదలైన పాలిటెక్నిక్ ప్రవేశపరీక్షలో రాష్ట్రస్థాయి 78వ ర్యాంకు సాధించారు. పరీక్ష మొత్తం 120 మార్కులకు 110 మార్కులు సాధించారు.

# శిల్పారామంలో వేసవి ఉత్సవాలు




కాకినాడ రూరల్ : తూర్పు గోదావరి జిల్లా కాకినాడ రూరల్ బీచ్‌లోగల శిల్పారామం వారి ఆధ్వర్యంలో వేసవి కాలాన్ని పురస్కరించుకొని శ్రీ భక్తాంజనేయ సురుచి ఫుడ్స్ సౌజన్యంతో వేసవి ఉత్సవం ఈనెల12వతేదీ నుండి 19 వతేదీ వరకు నిర్వహించబడతాయని కృష్ణప్రసాద్ తెలిపారు.శిల్పారామం కార్యాలయంలో పాత్రికేయుల సమావేశం ఏర్పాటు చేసారు.ఈ సందర్భంగా పరిపాలన అధికారి కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు గతంలో ఘనంగా బీచ్ ఫెస్టివల్ వేలాది మంది ప్రజల మధ్యలో ఘనంగా జరిపించామని ఈ ఫెస్టివల్ కు ఉత్తర ప్రదేశ్, అరుణాచల్ ప్రదేశ రాజస్థాన్ వంటి రాష్ట్రాల నుండి అనేక మంది ప్రజలు అలాగే తెలుగు రాష్ట్రాల నుంచి కూడా విశేష జనవాహిని మధ్య ఘనంగా బీచ్ ఫెస్టివల్ జరిగిందన్నారు. అదేవిధంగా శ్రీ భక్తాంజనేయ సురుచి ఫుడ్స్ సౌజన్యంతో వేసవి కాలాన్ని పురస్కరించుకొని సంస్కృతి సంప్రదాయాల సమాహారం శిల్పారామం కాలుష్యపు మేఘాలు కనబడిన చోటులో హారన్ మోతలు హవ్ ఆహా ఆకారాలు వినపడనితోటలో ఆహ్లాదకరమైన వాతావరణం పులకరింపజేసే గ్రామీణ వనములో ఉత్సవాలను జరిపిస్తున్నామని ముఖ్యంగా రాష్ట్రంలోనే కాకుండా దేశంలో ఎక్కడైనా చేతి వృత్తులు కలిగిన కళాకారులు ఈ ఉత్సవాల్లో పాల్గొని వారి యొక్క ప్రతిభ నైపుణ్యం కనబరచాలని వారికి తగినట్లుగా ముందు సమాచారం మేరకు వివిధ స్టాల్స్ ఏర్పాటు చేయడం జరుగుతుందని అలాగే లేస్‌అల్లికలు కలంకారి, హ్యాండ్లూమ్స్, జ్యువలరీ, సముద్రపు గవ్వలుచే చేయబడిన ద్వారపు హారాలు, వీవర్స్ ఉత్పత్తులు అటవీ మరియు గిరిజన ఉత్పత్తులు వంటి వృత్తుల వారిని మేము పూర్తిగా సహకరిస్తామని శిల్పారామం పరిపాలన అధికారి కృష్ణ ప్రసాద్ తెలిపారు.

# మే నెల ఆరోగ్య సూచీ విడుదల



విజయనగరం : జిల్లా వైద్యఆరోగ్య శాఖ ద్వారా ప్రచురితమైన మే నెల ఆరోగ్య సూచీ(హెల్త్ బులెటిన్)ను సంయుక్త కలెక్టర్-2 జె.సీతా రామారావు తన ఛాంబరులో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు వైద్య కార్యక్రమాల అవగాహనకు ఆరోగ్య సూచిక ఉపయోగపడుతుందని చెప్పారు. మొబైల్ మెడికల్ యూనిట్లు, మహిళా మాస్టర్ హెల్త్ చెకప్, ఈ-పట్టణ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు వినియోగించుకోవాలని సూచించారు. ఈ నెల 16న డెంగీ దినం సందర్భంగా డెంగీ కార్యాచరణ ప్రణాళిక, నివారణ చర్యలపై ప్రజలకు అవగాహన కలిగించేవిధంగా బులె టిన్‌లో ప్రచురించారు. కార్యక్రమంలో వైద్యఆరోగ్యశాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్ జయశ్రీ, డీఎంహెచ్‌వో విజయలక్ష్మి, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ సీతల్‌వర్మ తదితరులు పాల్గొన్నారు.

# అందుకే కోహ్లీని మాత్రమే తీసుకున్నా : అఫ్రిది




ఇస్లామాబాద్ : వివాదాలకు కేంద్ర బిందువుగా ఉండే పాకిస్థాన్ మాజీ క్రికెటర్ షాహిదీ అఫ్రిది ఈ మధ్య తరచూ వార్తల్లో నిలుస్తున్నాడు. ఇటీవల తన బయోగ్రఫీ గేమ్ ఛేంజర్‌లో గంభీర్‌తో పాటు పలువురు క్రికెటర్లను ప్రస్తావిస్తూ విమర్శలు గుప్పించాడు. దాంతో ఆగకుండా ఆల్‌టైం ప్రపంచకప్ జట్టును కూడా ప్రకటించి మరో దుమారానికి తెరలేపాడు.

ఆ జట్టులో భారత మాస్టర్ బ్లాస్టర్ సచిన్‌తో పాటు భారత జట్టు మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీకి కూడా చోటు కల్పించలేదు. దీంతో భారత్‌తో పాటు ఇతర దేశాల క్రికెట్ అభిమానుల నుంచి తీవ్ర విమర్శలు ఎదుర్కొన్నాడు. అయితే, తాజాగా వాళ్లిద్దరికీ చోటు కల్పించకపోవడానికి గల కారణాలు అఫ్రిది వెల్లడించాడు. సచిన్, ధోనీ భారత క్రికెట్‌కు ఎంతో కీర్తి తెచ్చిపెట్టారు. వాళ్లను కించపరచడం నా ఉద్దేశం కాదు. కోహ్లీని ఎంచుకోవడానికి కారణం అతని బ్యాటింగ్ మాయాజాలమే. కోహ్లీ బ్యాటింగ్ చేస్తుంటే అలాగే చూస్తూ ఉండిపోవాలనిపిస్తుంది. రెండు దేశాల మధ్య విద్వేషాలను తగ్గించేందుకు క్రికెట్ మంచి మార్గం. అందుకే భారత్, పాకిస్థాన్ ద్వైపాక్షిక సిరీస్‌లు ఆడాలి. అలా అయితేనే రెండు దేశాల ప్రజల మధ్య మనస్పర్ధలు తొలగిపోతాయి అని అఫ్రిది పేర్కొన్నాడు.

2004లో భారత్, పాకిస్థాన్ మధ్య క్రికెట్ మ్యాచ్ చూసేందుకు భారత్ నుంచి పాకిస్థాన్‌కు వచ్చిన అభిమానులను పాక్ ప్రజలు ఎంతో ప్రేమతో చూసుకున్నారని గుర్తు చేశాడు. భారత్‌తో మళ్లీమళ్లీ మ్యాచ్‌లు ఆడాలని కోరుకుంటున్నానన్నాడు. రెండు దేశాల ప్రజలు తమ క్రికెటర్లను ఎంతగానో ప్రేమిస్తారు. ఈ దేశాల మధ్య క్రికెట్ మ్యాచ్ చూడాలని కోరుకుంటారని అఫ్రిది పేర్కొన్నాడు.

# ఘనంగా ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవం


మహిళకు కుట్టు యంత్రాన్ని అందిస్తున్న గవర్నరు బన్వరిలాల్ పురోహిత్

వడపళని : 'ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ' తమిళనాడు శాఖ ఆధ్వర్యంలో 'వరల్డ్ రెడ్‌క్రాస్ దినోత్సవం' ఘనంగా జరిగింది. కార్యక్రమానికి రాష్ట్ర గవర్నరు బన్వరిలాల్ పురోహిత్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ముందుగా రెడ్ క్రాస్ ఉద్యమ వ్యవస్థాపకుడైన హెన్రీ డ్యూనెం ట్‌కు అందరం నివాళు లర్పించాలని పేర్కొన్నారు. ఆయన ప్రవేశ పెట్టిన మార్గ దర్శకాలనే అనేకమంది స్వచ్ఛంద సేవకులు అను సరిస్తూ సేవలందిస్తున్నారన్నారు. 1920లో ఆవిర్భవించిన 'ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ' (ఐఆర్సీఎస్) ప్రస్తుతం సేవలు భారీగా విస్తరించిందని తెలిపారు. రాష్ట్రంలో రెడ్ క్రాస్ సొసైటీ ఆర్థికంగా వెనుకబడిన వర్గాల కోసం డే కేర్ ఆసుపత్రి, అధునాతన వసతులతో కూడిన రక్త సేకరణ నిధి, ఆర్థిక స్థోమత లేని వారికి ఉచితంగా నర్సింగ్ కోర్సులో శిక్షణ, దివ్యాం గుల కోసం కృత్రిమ కాలు, ఫిజియోథెరపీ, ఫిట్‌నెస్ కేంద్రాలు వంటివి నడుస్తున్నాయని పేర్కొన్నారు. వరల్డ్ రెడ్ క్రాస్ డే సందర్భంగా ప్రత్యేక జరిగిన వైద్య శిబిరంలో ఆయా రంగాలకు చెందిన వైద్య నిపుణుల సమక్షంలో పలు పరీక్షలు నిర్వహించారు. లబ్ధిదారులు గవర్నరు చేతుల మీదుగా కుట్టు యంత్రాలు, ఇతర పరికరాలను అందుకున్నారు. కార్యక్రమానికి గవర్నరు అదనపు ప్రధాన కార్యదర్శి ఆర్.రాజగోపాల్, తమిళనాడు విభాగ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఉపాధ్యక్షుడు ఎస్జీ ప్రభాకరన్, ఛైర్మన్ డాక్టర్ హరిష్ ఎల్.మెహతా, వైస్ ఛైర్మన్ ఆరెం బాలసుబ్రహ్మణ్యం, తమిళనాడు విభాగ ప్రధాన కార్యదర్శి ఎంఎస్ఎం నస్‌రుద్దీన్, కోశాధికారి డాక్టర్ సి.ఇందర్‌నాథ్ హాజరయ్యారు.

# భక్తిశ్రద్ధలతో బృందావన ప్రతిష్ఠాపన



కంప్లి : కంప్లి సత్యనారాయణపేటలో నూతనంగా నిర్మించిన రాఘవేంద్ర స్వామి శాఖ మఠంలో బృందావన ప్రతిష్ఠాపన భక్తిశ్రద్ధలతో జరిగింది. వాదిరాజాచార్ అర్చకత్వంలో మంత్రాలయ రాఘవేంద్రస్వామి మఠం సుబుదేంద్ర స్వామీజీ చేతుల మీదుగా శాస్త్రోక్తంగా ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పంచామృతాభిషేకం, ఇతర పూజలు జరిగాయి. మాధవతీర్థ సభా భవనాన్ని ప్రారంభించిన అనంతరం స్వామీజీ భక్తులనుద్దేశించి మాట్లాడారు. కలియుగంలో రాఘవేంద్ర స్వామి కల్పవృక్షం వంటివారు. కోరిన కోర్కెలు తీరుస్తారు. ప్రతినిత్యం శాఖ మఠంలో పూజా కార్యక్రమాలు జరుగుతాయి. అన్ని కులాల వారు బృందావన దర్శనానికి రావచ్చు శాఖ మఠం గౌరవ విచారణ ప్రతినిధిగా కంప్లికి చెందిన టి.కొట్రేశ్‌ను నియమిస్తున్నట్లు సుబుదేంద్ర తెలిపారు. మఠం నిర్మాణానికి సహకరించిన వారిని, దాతలను సన్మానించారు. అన్న సంతర్పణ ఏర్పాటు చేశారు. శాసనసభ్యుడు గణేశ్, మఠం నిర్మాణ సమితి సభ్యులు, స్థానిక నాయకులు, కంప్లి పట్టణం, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పాల్గొన్నారు. బుధవారం రాత్రి పట్టణంలో శోభాయాత్ర జరిగింది. అమృత శిలా రామచంద్ర ఆలయం నుంచి సత్య నారాయణ పేట శాఖ మఠం వరకు సుబుదేంద్ర స్వామీజీని ఘనంగా ఊరేగించారు.

# గంభీర్ అటువంటి వ్యక్తి కాదు..



న్యూఢిల్లీ: మాజీ క్రికెటర్, ఢిల్లీ తూర్పు నియోజకవర్గ భాజపా అభ్యర్థి గౌతం గంభీర్.. తనకు వ్యతిరేకంగా అశ్లీల, అభ్యంతరకర వ్యాఖ్యలతో కూడిన కరపత్రాలను పంచుతున్నారని ఆమ్ ఆద్మీ పార్టీ నాయకురాలు అతిషీ ఆరోపిస్తూ కన్నీరు పెట్టుకున్న విషయం తెలిసిందే. ఈ విషయంపై టీమిండియా మాజీ క్రికెటర్ వీవీఎస్ లక్ష్మణ్‌తో పాటు హర్భజన్ సింగ్ స్పందిస్తూ.. గంభీర్‌కు మద్దతుగా నిలిచారు. గంభీర్ అటువంటి వ్యక్తి కాదని వారు ట్విటర్‌లో పేర్కొన్నారు.

నిన్న చోటు చేసుకున్న పరిణామాల గురించి తెలుసుకుని షాకయ్యాను. నాకు దాదాపు రెండు దశాబ్దాలుగా గౌతం గంభీర్ తెలుసు. మహిళల పట్ల ఆయనకు ఉన్న గౌరవం, ఆయన వ్యక్తిత్వం ఏంటో నాకు బాగా తెలుసు అని వీవీఎస్ లక్ష్మణ్ తెలిపారు. గౌతమ్ గంభీర్‌పై వస్తున్న ఈ ఆరోపణల గురించి తెలుసుకుని నేను షాకయ్యాను. ఆయన గురించి నాకు బాగా తెలుసు.. ఆయన మహిళల గురించి ఎప్పటికీ చెడుగా మాట్లాడరు. ఆయన ఈ ఎన్నికల్లో గెలుస్తారా? లేదా? అన్నది వేరే విషయం.. కానీ, ఆయన వీటన్నింటికీ అతీతంగా ఉంటారు అని హర్భజన్ సింగ్ పేర్కొన్నారు.

కాగా, ఈ విషయంపై గంభీర్ తాజాగా మరోసారి స్పందించారు. అరవింద్ కేజ్రీవాల్‌తో పాటు ఆప్‌నకు ఇదే నా సవాలు.. ఈ కరపత్రాలతో నాకు సంబంధం ఉందని మీరు నిరూపిస్తే నేను ప్రజల మధ్యే ఉరి వేసుకుంటాను. రుజువు చేయలేకపోతే కేజ్రీవాల్ రాజకీయాలను విడిచిపెట్టాలి. నా సవాలును స్వీకరిస్తారా? అని ట్వీట్ చేశారు.

# మహర్షి కలెక్షన్స్ జోరు..!

## ఎన్ని కోట్లు రాబట్టిందో తెలుసా?



ఎన్నో అంచనాల మధ్య వచ్చిన మహర్షి సినిమా మంచి టాక్‌తో థియేటర్లలో సందడి చేస్తోంది. విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీసు వద్ద విజయవంతంగా రాణిస్తున్నట్లు సినీ విశ్లేషకులు పేర్కొన్నారు. తొలిరోజున ఈ చిత్రం నైజాంలో రూ.6.38 కోట్లు, యూఏలో రూ2.88 కోట్లు, సీడెడ్‌లో రూ.2.89 కోట్లు, తూర్పు గోదావరి జిల్లాలో రూ.3.2 కోట్లు, పశ్చిమ గోదావరిలో రూ.2.47 కోట్లు, కృష్ణలో రూ.1.39 కోట్లు, గుంటూరులో రూ.4.4 కోట్లు, నెల్లూరులో రూ.1 కోటి .. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో కలిపి రూ.24.6 కోట్లు (షేర్) రాబట్టినట్లు అంచనా వేశారు. రెండో రోజు కూడా వసూళ్ల జోరు కొనసాగే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు.

అగ్ర కథానాయకుడు మహేశ్‌బాబు 25వ సినిమాగా మహర్షి రూపొందింది. వంశీ పైడిపల్లి దర్శకత్వం వహించారు. పూజా హెగ్డే కథానాయిక. అల్లరి నరేష్ కీలక పాత్ర పోషించారు. దేవిశ్రీ ప్రసాద్ బాణీలు అందించారు. దిల్‌రాజు, ప్రసాద్ వి పొట్లూరి, అశ్వినీదత్ నిర్మాతలుగా వ్యవహరించారు. ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమాకు విశేషమైన స్పందన లభించింది. మహేశ్ నటన, కథ, వంశీ టేకింగ్ అద్భుతంగా ఉన్నాయని చిత్ర బృందాన్ని ప్రముఖులతోపాటు నెటిజన్లు ప్రశంసించారు.

# గజినిలో అనవసరంగా నటించా: నయన్



గజిని చిత్రంలో తాను అనవసరంగా నటించానని బాధపడుతున్నారు లేడీ సూపర్‌స్టార్ నయనతార. ఓ ప్రముఖ తమిళనాడు మ్యాగజైన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో నయన్ ఈ విషయాన్ని వెల్లడించారు. 2005లో వచ్చిన గజిని సినిమాలో నయన్ చిత్ర అనే వైద్యురాలి పాత్రలో నటించారు. అయితే దర్శకుడు ఏ.ఆర్ మురుగదాస్ తనకు చిత్ర పాత్ర గురించి ఒకలా వివరించి, తెరకెక్కించేటప్పుడు మాత్రం మార్చేశారని నయన్ అన్నారు.

తన కెరీర్‌లో గజిని సినిమాను ఎంచుకోవడమే తాను చేసిన తప్పని పేర్కొన్నారు. అయితే ఆ అనుభవం మల్టీస్టారర్ సినిమాలు ఎంచుకునే ముందు జాగ్రత్తగా ఉండాలన్న విషయాన్ని నేర్పిందని తెలిపారు. గజిని సినిమాలో సూర్య, అసిన్ జంటగా నటించారు. ఏ.ఆర్ మురుగదాస్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం అప్పట్లో వసూళ్ల పరంగా రికార్డులు సృష్టించింది. ఆ తర్వాత సినిమాను హిందీలో ఇదే టైటిల్‌తో రీమేక్ చేశారు. హిందీ రీమేక్‌లో అమిర్ ఖాన్, అసిన్ జంటగా నటించారు. ప్రస్తుతం నయన్ దర్బార్ సినిమాతో బిజీగా ఉన్నారు. రజనీకాంత్ కథానాయకుడిగా నటిస్తున్నారు. ఈ సినిమాను ఏ.ఆర్ మురుగదాస్ తెరకెక్కిస్తున్నారు.

# చిత్రభాను

## చివరి నిమిషంలో ఆగిపోయిన విశాల్ సినిమా!




తమిళ స్టార్ విశాల్‌ను సమస్యలు వెంటాడుతున్నాయి. ఓ పక్క నడిగర్ సంఘం వివాదం కొనసాగుతుండగా.. మరోపక్క ఆయన నటించిన అయోగ్య సినిమా విడుదల ఆగిపోయింది. తెలుగు హిట్ టెంపర్‌కు తమిళ రీమేక్ ఇది. వెంకట్ మోహన్ దర్శకత్వం వహించారు. రాశీ ఖన్నా కథానాయిక పాత్ర పోషించారు. కాగా ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రావాల్సి ఉంది. ఈ నేపథ్యంలో టికెట్ల అడ్వాన్స్ బుకింగ్ కూడా జరిగిపోయింది. అయితే సినిమా విడుదలను చివరి నిమిషాల్లో వాయిదా వేశారు. ఆర్థిక లావాదేవీల కారణంగా విడుదల కానట్లు చెబుతున్నారు.

ఈ నేపథ్యంలో విశాల్ ట్విటర్ వేదికగా స్పందించారు. నేను ఎంతో కష్టపడి నటించిన అయోగ్య సినిమా విడుదల కోసం ఎదురుచూస్తున్నా. నటుడిగా ఎప్పటిలాగే నా నుంచి ది బెస్ట్ ఇచ్చా. నా బిడ్డను (సినిమాను) నేను జాగ్రత్తగా బాగా చూసుకున్నా, కానీ అది సరిపోలేదేమో. నాకూ సమయం వస్తుంది. నా ప్రయాణాన్ని ఇలానే కొనసాగిస్తా అని పేర్కొన్నారు. సినిమా విడుదల విషయంలో నిర్మాణ సంస్థ స్టూడియో గ్రీన్, పంపిణీదారులకు మధ్య చర్చలు జరుగుతున్నట్లు కోలీవుడ్ వర్గాల సమాచారం. ఆర్థిక లావాదేవీలు ఓ కొలిక్కి వచ్చిన తర్వాత సినిమాను విడుదల చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.









## ఎయిరిండియా భారీ ఆఫర్

ముంబయి: జెట్ ఎయిర్‌వేస్ విమానయాన సంస్థ మూతపడిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. టికెట్ల మీద అధిక ధర చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది. వారి బాధలకు చెక్ పెడుతూ ప్రభుత్వ రంగ విమానాయాన సంస్థ ఎయిరిండియా సరికొత్త ఆఫర్‌తో ముందుకొచ్చింది. చివరి నిమిషంలో కొనుగోలు చేసే టికెట్ల మీద భారీ తగ్గింపు ఇవ్వనున్నట్లు ప్రకటించింది. చివరి నిమిషంలో బుకింగ్ చేసుకొనేవారికి టికెట్ మీద 50 శాతం తగ్గింపు ఇవ్వనున్నట్లు ఆ సంస్థ అధికారి మీడియాకు వెల్లడించారు.

విమానం బయలుదేరడానికి మూడు గంటల ముందు చివరి నిమిషంలో కొనుగోలు చేసే టికెట్లను భారీ తగ్గింపుతో అమ్మకానికి పెట్టాలని నిర్ణయించినట్లు సంస్థ ప్రకటనలో పేర్కొంది. ముంబయిలోని ఎయిరిండియా కేంద్ర కార్యాలయంలో జరిగిన వాణిజ్య సమీక్షా సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది.

సాధారణంగా చివరి నిమిషంలో నిర్ణీత ధరల కంటే అధికంగా చెల్లించి టికెట్లను బుకింగ్ చేసుకోవాల్సిన పరిస్థితి ఉంటుంది. జెట్ ఎయిర్‌వేస్‌ను మూసివేయడంతో డిమాండ్- సప్లయికు మధ్య పొంతన ఉండటం లేదని ఆ అధికారి తెలిపారు. అయితే ఇకనుంచి చివరి నిమిషంలో ప్రయాణించే వారు తక్కువ ధరకే టికెట్లు పొందచ్చని, వాటిని ఎయిరిండియా కౌంటర్లు, మొబైల్ యాప్, ఏజెంట్స్ ద్వారా బుక్ చేసుకోవచ్చని తన ప్రకటనలో పేర్కొంది.

# నీటి ఎద్దడిని ఎదుర్కోవాలి



- ముందస్తు చర్యలు చేపట్టాలి
- పాఠశాలలకు మౌలిక వసతులు కల్పించాలి
- వర్షాకాలానికి ముందుగానే జాగ్రత్తవహించాలి
- గృహ సముదాయాలకు వసతులకల్పనే ధ్యేయం
- జెడ్పీ చైర్‌పర్సన్ లాలం భవాని
- ముగిసిన సర్వసభ్య సమావేశం

విశాఖపట్నం: వేసవిని దృష్టిలో పెట్టుకొని త్రాగునీటికి ప్రజలు ఇబ్బందులు పడకుండా ముందస్తు చర్యలు చేపట్టి నీటి ఎద్దడిని ఎదుర్కొనాలని జిల్లాపరిషత్ చైర్ పర్సన్ లాలంభవాని పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా పరిషత్ సమావేశమందిరంలో జరిగిన సర్వసభ్య సమావేశానికి అధ్యక్షత వహించి పలు పథకాల అమలుపై సమీక్షించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తనానియమావళి అమలులో ఉన్నందున కొత్తగా చర్చించడానికి, తీర్మానాలు చేపట్టడానికి, నూతన పథకాలను ప్రారంభించడం, హామీలాంటి వాటిని అమలు చేయడానికి వీలుపడదని, గతంలో చేపట్టిన అభివృద్ధి పనుల తీరు తెన్నుల మాత్రమే సమీక్షించుకోవడం జరుగుతుందన్నారు. ఈ సంవత్సరం జలాశయాలు అడుగంటడం, ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో త్రాగునీటికి ఇబ్బందులు ఎదురౌతున్నాయన్నారు. అన్ని గ్రామాలలోను పాడైన బోర్లను వెంటనే మరమ్మతులు చేపట్టడం, చెరువులు పూడిక తీత, వాటర్ ట్యాంకుల క్లోరినేషన్ తదితరాలను చేపట్టాలన్నారు. జూన్ నెలలో చేపట్టనున్న వ్యవసాయ చర్యలు, పాఠశాలలకు సంబందించి విద్యార్థులకు ముందుగానే ఏకరూప దుస్తులు, పుస్తకాలను అందజేసే విధంగా చూడాలన్నారు. అదే విదంగా పాఠశాలలో కావల్సిన మౌళిక వసతుల కల్పన, గదుల మరమ్మతులు తదితర పనులను వేగవంతంగా చేయాలన్నారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని సీజనల్ వ్యాదులు మలేరియా, డెంగ్యూ వ్యాధులు ప్రభలకుండా ముందస్తు చర్యలు చేపట్టడంతో పాటు అన్ని పి హెచ్ సిలలో అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఆర్ డబ్ల్యు ఎస్ ఎస్ ఇ రవికుమార్ మాట్లాడుతూ అన్ని గ్రామీణ ప్రాంతాలలో త్రాగునీటికి సంబందించి సమ్మర్ యాక్షన్ ప్లాన్ లో భాగంగా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను రూపొందించి పద్దతి ప్రకారం చర్యలను చేపట్టడం జరుగుతుందన్నారు. పాడైన బోర్లను మరమ్మత్తులను చేపట్టడం జరుగుతుందని, పి డబ్ల్యు ఎస్, సి పి డబ్ల్యు ఎస్ స్కీమ్ లకు సంబందించి పనులను వేగవంతంగా చేయడం జరుగుతుందన్నారు. స్వజల ప్రోగ్రామ్ కింద ఎటువంటి స్కీమ్ లు లేని ఆవాసాలలో త్రాగునీటి సదుపాయాన్ని కల్పించడం జరుగుతుందన్నారు. నూతనంగా ఆర్ ఓ ప్లాంట్ ల మంజూరు కై ప్రతిపాదనలను పంపడం జరిగిందన్నారు. క్రాష్ ప్రోగ్రామ్ కింద మండలాలలో మొబైల్ టీమ్ లు అన్ని గ్రామాలలో బోర్లు మరియు స్కీమ్ లను అన్నింటిని తనిఖీలను నిర్వహించ మరమ్మతులను చేపట్టడం జరుగుతుందన్నారు.

గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు అధికారి సి.జయరామాచారి మాట్లాడుతూ వివిధ పథకాల ద్వారా జిల్లాలో 30,537 గృహాలను సుమారు రూ. 41,427 లక్షల వ్యయంతో పూర్తి చేయడం జరిగిందని, ఇంకను 42,291గృహ నిర్మాణాలు వివిధ దశలలో ఉన్నాయన్నారు. నిర్మాణాలను చేపట్టిన అన్ని గృహ సముదాయాలలో కావల్సిన మౌళిక సదుపాయాలను కల్పించడం జరిగిందన్నారు.

మిగిలిన పోస్టులను త్వరలో భర్తీ చేయనున్నామన్నారు. వైద్య రంగ సంస్కరణలో భాగంగా ఈ - ఔషది, ఎన్టీ ఆర్ ఉచిత వైద్య పరీక్షలు, టెలీ రేడియాలజీ, ఆసుపత్రి పరికరాల నిర్వహణ, తల్లి బిడ్డ ఎక్స్ ప్రెస్, చంద్రన్న సంచార చికిత్స, ముఖ్యమంత్రి



ఆరోగ్య కేంద్రం, ఉచిత డయాలసిస్, గిరి ఆరోగ్య కేంద్రాలు, ఫీడర్ అంబులెన్స్, తదితర రాష్ట్ర ప్రభుత్వ పథకాలతో పాటు కేంద్ర ప్రభుత్వ పథకాలను కూడా అమలు చేయడం జరుగుతుందన్నారు. వేసవిని దృష్టిలో పెట్టుకొని వడదెబ్బ తగలకుండా అన్ని ముఖ్య కూడళ్లల్లో చలివేంద్రాల ఏర్పాటు, ఒ ఆర్ ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు.

వ్యవసాయ శాఖ జాయింట్ డైరక్టర్ మల్లికార్జున రావు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ కు సంబందించి 2019 సంవత్సరానికి వరి, వేరు సెనగ, పచ్చిరొట్ట విత్తనాలు తదితరాలను రాయితీ పై సరఫరా చేయడానికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయడం జరిగిందన్నారు. భూసార పరీక్ష కార్యక్రమం కింద మట్టి నమూనాలను సేకరించి పత్రాలను పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఆధునిక యాంత్రీకరణ పథకం ద్వారా ఇప్పటి వరకు 1644 పరికరాలను సరఫరా చేసి రాష్ట్రంలో జిల్లా మొదటి స్థానంలో నిల్చిందన్నారు.

ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద 2018 లో 18,728 హెక్టార్లకు 33219 మంది రైతులు భీమా చేసుకోవడం జరిగిందన్నారు. ప్రకృతి సేద్యం ద్వారా 51 క్లస్టర్లలలో రై తులుసాగు చేసు కుంటున్నారన్నారు. మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు అధికారి సునంద మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా పౌష్టికాహార కార్యక్రమాలు సప్లమెంటరీ న్యూట్రీషన్, అన్న అమృత హస్తం, గిరి గోరుముద్దలు, సబల పథకాలను నిర్వహించడం జరుగుచున్నదన్నారు. బాలసంజీవని లో భాగంగా షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగలు మరియు సాధారణ కేటగిరి జనాభలో గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల పోషణ మెరుగుదలకు అదనపు పోషకాహార కార్యక్రమాన్ని చేపట్టడం జరుగుతుందన్నారు.

ఎన్ ఆర్ ఇ జి ఎస్ కన్వర్జన్స్ పనులలో భాగంగా అంగన్ వాడీ భవనాలు నిర్మాణాలను చేపట్టడం జరుగుతుందన్నారు. సర్వ సభ్య సమావేశంలో శాసన మండలి సభ్యులు దువ్వారపు రామారావు, బుద్ద నాగజగదీశ్వరావు, పప్పల చలపతిరావు, శాసన సభ్యులు పీలా గోవింద సత్యన్నారాయణ, జిల్లా పరిషత్ సి ఇ ఓ రమణమూర్తి, ఎం పి పి , ఎం పి టి సి, జెడ్ పి టి సి లు, జిల్లా అధికార్లు పాల్గొన్నారు.







# ఏసీ బస్ షెల్టర్ ప్రారంభం




విశాఖ సిటీ: బస్సులో ప్రయాణించే ప్రయాణికులకు ఎండవేడిమి నుంచి చల్లదనం పొందేందుకు వీలుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా ఏసీ బస్ షెల్టర్‌ను ఆర్టీసీ కాంప్లెక్స్ 222 బస్ స్టాప్ వద్ద శుక్రవారం పోర్ట్ చైర్మన్ క్రిష్ణ బాబు ప్రారంభించారు. సామాజిక బాధ్యతలో భాగంగా పోర్ట్, సీఎంఆర్ ,రేడియో మిర్చి సహకారంతో ఈ బస్టాప్ నిర్మించడం జరిగిందని కృష్ణ బాబు పేర్కొన్నారు. ఈ బస్టాప్‌లో రెండు ఏసీలతోపాటు మంచినీటి సౌకర్యం, వినోదానికి 98.3 మిర్చి అందుబాటులో ఉంచడం జరిగిందని పేర్కొన్నారు.

ఈ సేవలన్నీ ఈ బస్టాప్‌లో ఉచితంగానే అందిస్తామన్నారు. రాష్ట్రంలో ఈ తరహా బస్ స్టాప్‌లు మొట్టమొదటిగా విశాఖలోనే ప్రారంభించబడిందన్నారు.

ఈ అత్యాధునిక బస్టాప్ కార్యక్రమంలో సీఎంఆర్ డైరెక్టర్ మావూరి బాలాజీ, ఆర్టీసీ అధికారులు, రేడియో మిర్చి ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# క్షణికావేశంలో తండ్రిని హత్యచేసిన కుమార్తె



విశాఖ సిటీ : వేరే మహిళతో సహజీవనం చేస్తూ .. తన తల్లిని మానసికంగా వేధిస్తున్నాడని ఆగ్రహించిన ఓ కుమార్తె క్షణికావేశంలో తండ్రిపై చాకుతో దాడిచేసి హతమార్చింది. ఈ ఘటన విశాఖ కంచర పాలెంలోని రవీంద్రనగర్‌లో గురు వారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రైల్వే ఉద్యోగి కోడ సముద్రయ్య (48) కుటుంబంతో కలసి రవీంద్రనగర్‌లో నివాసముంటున్నాడు. ఈ క్రమంలో భర్తతో విడిపోయి వేరుగా ఉంటున్న ఓ మహిళతో సముద్రయ్య సహజీవనం చేస్తున్నాడు. అంతటితో ఆగకుండా ఆమెను నేరుగా ఇంటికి తీసుకువచ్చాడు. ఈ నేపథ్యంలో కుటుంబంలో కలహాలు మొదలయ్యాయి. గురువారం అర్ధరాత్రి దంపతులిద్దరూ ఘర్షణపడ్డారు. తల్లిపై దాడి చేస్తున్న సముద్రయ్యను అడ్డుకోబోయిన కుమార్తె బిబాషాపై కూడా దాడికి యత్నించాడు. క్షణికావేశంలో బిబాషా ..ఇంట్లో ఉన్న చాకుతో తండ్రిని పొడిచింది. అనంతరం సముద్రయ్యతో సహజీనం చేసే మహిళను కూడా చాకుతో పొడిచి గాయపరిచింది. ఈ ఘటనలో సముద్రయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన ఆమెను స్థానికులు కేజీహెచ్‌కు తరలించారు. సమాచారం తెలుసుకున్న కంచరపాలెం సీఐ భవానీ ప్రసాద్ సంఘటన స్థలానికి చేరుకొని బిబాషా, ఆమె తల్లి నాగలక్ష్మిని అదుపులోకి తీసుకున్నారు. ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

## ఇంటర్ ప్రవేశాలకు షెడ్యూల్ విడుదల

హైదరాబాద్: తెలంగాణలో ఇంటర్మీడియట్ ప్రవేశాల షెడ్యూల్‌ను ఇంటర్ బోర్డు ప్రకటించింది. జూనియర్ కళాశాలల్లో మొదటి విడత ప్రవేశాల కోసం ఈ నెల 21 నుంచి దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం కానుంది. జూన్ 1నుంచి ఇంటర్ తరగతులు ప్రారంభించాలని బోర్డు నిర్ణయించింది. రెండో విడత ప్రవేశాల తేదీలను తర్వాత ప్రకటించనున్నట్టు బోర్డు కార్యదర్శి అశోక్ వెల్లడించారు. ఒక్కో సెక్షన్‌లో 88 మందికి మించి చేర్చుకోకూడదని ఆయన కళాశాలల యాజమాన్యాలకు సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే మాత్రం చర్యలు తప్పవని హెచ్చరించారు.

# టీవీ9 సీఈవోగా మహేంద్ర మిశ్రా నియామకం

హైదరాబాద్: టీవీ9 న్యూస్ చానెల్‌లో రవి ప్రకాశ్ ప్రస్థానం ముగిసింది. ఇప్పటికే ఆయనపై ఫోర్జరీ కేసు నమోదైన విషయం తెలిసిందే. అసోసియేటెడ్ బ్రాడ్ కాస్టింగ్ ప్రైవేట్ లిమిటెడ్ (ఏబీసీఎల్) సెక్రటరీ దేవేందర్ అగర్వాల్ సంతకాన్ని ఫోర్జరీ చేసి.. ఆయన కంపెనీకి రాజీనామా చేసినట్టు పాత తేదీలతో పత్రాలు సృష్టించారంటూ ఏబీసీఎల్‌ను కొత్తగా టేకోవర్ చేసిన అలందా మీడియా అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ పీ కౌశిక్ రావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సైబరాబాద్ సైబర్ క్రైం పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో రవిప్రకాశ్‌ను టీవీ9 సీఈవోగా తొలగించినట్టు అలందా మీడియా అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ తెలిపింది.

ఇటీవల ఏబీసీఎల్ బోర్డు డైరెక్టర్స్ కొత్త టీమ్‌ను నియమించారు. టీవీ9 సీఈవోగా మహేంద్ర మిశ్రా, సీవోవోగా గొట్టిపాటి సింగారావును నియమించారు. మహేంద్ర మిశ్రా ప్రస్తుతం టీవీ9 కన్నడ ఎడిటర్, సీఈవోగా వ్యవహరిస్తున్నారు. దానికి అదనంగా.. టీవీ9 తెలుగు బాధ్యతలను కూడా బోర్డు డైరెక్టర్స్ ఆయనకు అప్పగించారు. సీవోవోగా నియమితులైన గొట్టిపాటి సింగారావు.. ప్రస్తుతం 10టీవీ సీఈవోగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

# ఏపీఎస్‌ఆర్టీసీ బకాయిలు రూ.6500 కోట్లు

## ఆర్టీసీ ఎండీ సురేంద్రబాబు



విజయవాడ: డీజిల్ ధరలు పెరగడం వల్ల ఏడాదికి రూ.650 కోట్లు భరించాల్సి వస్తోందని ఆర్టీసీ ఎండీ సురేంద్రబాబు అన్నారు. విజయవాడలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 2015-16 ఆర్థిక సంవత్సరంలో సంస్థకు రూ.735 కోట్లు నష్టం ఏర్పడిందని, 2016-17లో ఇది రూ.789 కోట్లకు చేరిందని తెలిపారు. 2017-18లో రూ1205 కోట్ల మేర ఆర్టీసీ నష్టపోయిందని సురేంద్రబాబు వివరించారు. ఈ ఏడాది పీఆర్సీ, డీజిల్ ధరల ప్రభావం ఉన్నప్పటికీ నిబద్ధతతో పని చేసి నష్టాన్ని తగ్గించామని వివరించారు. రుణాల రూపేణా ఆర్టీసీకి రూ.3,380 కోట్ల అప్పులున్నాయని సురేంద్రబాబు అన్నారు. విశ్రాంత ఉద్యోగులకు ఇవ్వాల్సిన రూ. 20 కోట్లు ఇంకా చెల్లించాల్సి ఉందని, ఉద్యోగుల భవిష్యనిధి పేరిట 671 కోట్లు జమచేయాల్సి ఉందని వెల్లడించారు. ఇతత్రతా బకాయిలన్నీ కలిపి ఆర్టీసీ రూ. 6500 కోట్ల మేర చెల్లించాల్సి ఉందని పేర్కొన్నారు. పన్ను రూపంలో రూ.316 కోట్లు ప్రభుత్వానికి చెల్లిస్తున్నామని పేర్కొన్నారు. పల్లె వెలుగు బస్సుల వల్ల రూ.1409 కోట్ల నష్టం వస్తోందని చెప్పారు. కాలంచెల్లిన బస్సులు నడిపే పరిస్థితి ఇకపై ఉండదని, 12 లక్షల కిలోమీటర్లు తిరిగిన బస్సులన్నీ మార్చాలంటే మొత్తం 1,666 కొత్త బస్సులు అవసరమవుతాయని ఎండీ తెలిపారు.

# ధోనీ తరహా వ్యూహరచన కోహ్లీకి కష్టమే సుమీ!



ముంబయి: ప్రస్తుత ప్రపంచకప్‌లో విరాట్ కోహ్లీ సారథ్యం వహిస్తున్న యువ భారత జట్టుకు ఎంఎస్ ధోనీ చక్కని మార్గదర్శకుడని అతడి చిన్ననాటి కోచ్ కేశవ్ బెనర్జీ అంటున్నారు. మహీ జట్టులో లేకుంటే విరాట్‌కు చాలా కష్టమని వెల్లడించాడు. ఆటను అధ్యయనం చేయడంలో, వ్యూహరచనలో మహీకెవరూ సాటిరారు. కోహ్లీలో ఇలాంటి లక్షణాలు లేవు. అందుకే సలహాల కోసం అతనెప్పుడూ ధోనీపై ఆధారపడాల్సిందే. ప్రపంచకప్ జట్టులో ధోనీ లేకుంటే సారథి కోహ్లీకి సాయం చేసేవారెవరూ ఉండరు అని కేశవ్ అన్నారు. ప్రస్తుతం ధోనీ ఏ స్థానంలో రావాలన్న ప్రశ్నకు కేశవ్ బెనర్జీ సమాధానం ఇచ్చారు. నాలుగో స్థానంలో ఆడితే నిలదొక్కుకోవడానికి సమయం ఉంటుంది. అప్పుడు ధోనీ రాణిస్తాడు. అదే 5, 6 స్థానాల్లోనైతే క్రీజులోకి వచ్చిన వెంటనే బంతిని బాదేయాలి. రిస్క్ తీసుకోవాల్సి ఉంటుంది. ప్రపంచకప్‌లో ధోనీ నాలుగో స్థానంలో బ్యాటింగ్ చేయాలి. అప్పుడతను స్వేచ్ఛగా ఆడతాడు. ఇది నా వ్యక్తిగత నిర్ణయం. ధోనీ ఎంత ఫిట్‌గా ఉన్నాడో మీకు తెలుసు. అతనెప్పుడు రిటైర్ అవుతాడో కనీసం అతడి సతీమణి, తండ్రికైనా తెలియదు అని కేశవ్ బెనర్జీ అన్నారు.






Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ☆ Phone : 2564353, Fax : 0891-2569004 ☆ e-mail: vijayabhanudaily@gmail.com